

1

పట్నవాసపు కోళ్ళకు కూడా బద్ధకమే। కనకమ్మగారి యింట పుంజు ఏడు గంటలకు "కొక్కురొక్కో" అంటున్నది.

పార్వతి పొరుగింటి గోడమీది పుంజును పురిమినట్లు చూసింది వాకిలి వూడ్చుగుందికి వుపక్రమిస్తూ.

"ముదనష్టపు మునగచెట్టు; దిక్కుమాలిన కొంప... వూడ్చిపొయ్యలేక నా ప్రాణాలు తోడుకుపోతున్నాయి ఛీ! ఛీ! యీ పాడు సొద యెప్పుడు విడిశాపన అవుతుందో గాని..."

పార్వతి కొంగుని ఒక చెయ్యి నడుంమీద వుంచుకుని, రెండో చేత్తో చీపురు పట్టుకొని కసిగా ముంగిలి వాకిలి వూడుస్తున్నది మునగచెత్తమీద కోపం "బరుకూ బరుకూ" మని చీపురికి, నేలకి మధ్య శబ్దంగా వినిపిస్తున్నది.

ఆమె వొక చెంపను, తూరుపు కొండను చర చరా యెక్కి వస్తున్న సూర్యుడు కర కరా పొడుస్తున్నాడు.

గది ముందు వసారాలో రాజయ్య బుద్ధిగా కూర్చుని శ్రద్ధగా పొగాకు కాడ చీల్చి, చుట్ట గట్టుకుంటున్నాడు.

అతగాడికి భార్య వాగ్ధోరణి యివాళ కొత్తదేంగాదు మునగచెత్త సమస్య కూడా చాలా పాతదేమరి!

అయితే అతని నిశ్చలత, పార్వతి గాజుల చెయ్యి, చీపురు బర బరా చేసే శబ్దాలముందు ఓటమి స్వీకరించింది. అతగాడు తలయెత్తి చూసేడు.

"ఏమిటి?" అందామనుకున్నాడు. ఆ ప్రశ్న యెంత ప్రమాదానికి దారి తీస్తుందో గ్రహించినవాడిలా వూరుకుని, తదేకంగా, ఆమెను చూడసాగాడు.

తూరుపు కేసినించి నీరెండ ఆమె నడుంమీంచి, రొమ్ముల క్రిందనించి దూసుకుని వస్తున్నదేమో, గీసినట్లు ఆమె అవయవాల ఒంపులు అగుపిస్తున్నాయి.

నీరెండ ఆమె కోపాన్ని ఉపశమింపజేసేందుకా అన్నట్లు, ఎర్రని పెదాల మధ్యగా వాటిని తాకుతున్నది .

"పుత్తడి బొమ్మ!"

అలా తలపోసినప్పుడు రాజయ్య చెయ్యి మీసంమీదకి వెళ్ళింది.

పార్వతి తన భార్య అవడం, తనకి గర్వంకాదా మరి?

అంతలో చిన్న ఎదురుగాలి వొకటి దూసుకొని పిచ్చివాడి ఆలోచనలాగ వీచింది.

మునగాకు...

మరోటి, మరోటీనా? పార్వతి పాదాల చుట్టురా, "తిట్టకు తిట్టకు" మన్నట్లు, ప్రదక్షణం చేసి వూరుకుంది. సగంమేరకు వూడ్చినవాకిలి మళ్ళీ

మొదటికి వచ్చింది.

పైనుంచి కూడా జల జలా ఆకు రాలింది.

పార్వతి వొళ్ళు మండిపోయింది.

"నా వల్లగాదు తల్లీ! యీ దిక్కుమాలిన సొద...నేనింక వూడ్చలేను తండ్రీ!" అని చీపురు పడేలున నేలకొట్టింది.

దాంతో మేలుకుని, నిక్షేపంలాంటి ఆనందం పోయిందే అనుకున్నట్లు—"ప్చ్ ప్చ్" అన్నాడు నోట చుట్ట బెట్టుకుని రాజయ్య.

పార్వతి భర్తను చూసి "బెల్లం కొట్టిన రాయిలా అట్లా కూచోటమేగాని... ఔనులే" అంటూ జుట్టు ముడి విప్పి ముడెట్టుకుని "ఆడదెలా ఛస్తేనేం...తాను హాయిగానుంటే సరి! పాడు మగజాతి" అని ముగించింది

రాజయ్య మునగాకుమీది కోపం, తన మీదికి తిరుగుతుందని గ్రహించినట్లు లేచాడు. పైమీద కండువా దులపుకుని భుజానా వేసుకుని "ఏంటో యేం చెయ్యం చెప్పు? దిక్కుమాలింది నిత్యమూ వుందేగా... యింకా యింకా పోను పోను గొంగళీ లొచ్చిపడతాయి చూడు' అంటూ భార్య సమాధానం వినకూడదన్నంత త్వరగా గుమ్మందిగి పోయాడు.

పార్వతి బాధపడిందీ అంటే తప్పలేదు. పొరుగింటి మునగచెట్టు, యిరుగింట వేళా పాళా లేకుండా వొకటేపంగా ఆకు రాల్చుతూవుంటే, దాన్ని వూడ్చి ఎత్తిపోసేది సాక్షాత్ శాంతిదేవతకైనా చిరెత్తుతుంది.

"పోనీ యిరుగుపొరుగులం... చెట్టు మా యింట నయితేనేం...? మీ యింట నయితేనేం? ఆకు రొద్దలకి రొద్దలు గొంగళీ పురుగులూ, కుప్పలకు కుప్పలూ మీరూ ఎత్తిపోస్తున్నారు ... మేము అనుభవిస్తున్నాము ... గనక యీ రెండు మునగ్గాయలూ మీరు పులుసులో వేసుకోండి" అని వాళ్ళివ్వరు.

పైగా మునగచెట్టుని ముదనష్టపుదీ, పాపిష్టిదీ అనొద్దని ఆంక్షకూడాను

అంతలో పొరుగింటినుండి కేకలు వినరా సాగినై కూడాను.

## 2

పార్వతీ, రాజయ్య దంపతుల యింటికీ, పొరుగింటికి మధ్య వొంటిపొర యిటికె గోడ మాత్రం వున్నది.

మునగచెట్టు యింట ఒకరా,? యిద్దరా?

నలుగురు కొడుకులు, ముగ్గురు కోడళ్లూ, పిల్లాపీచూ, కోడీ మేకా, బోలెడు బలగముంది.

అది ఒక సమష్టి కుటుంబం. ఆ యింట వయస్సుకీ, బరువు బాధ్యతలు నెత్తినవేసుగుందికీ, తల్లి కనకమ్మే పెద్దదిక్కు. ఆమెకు భర్త సూరయ్య మృత్యువాత పడిన తరువాత ఇంకా ఆమె కంటితడి ఆరనేలేదు. సూరయ్య దుక్కలా, కొడుకులకంట సింహస్వప్నమై తిని తిరుగుతున్న వాడల్లా ఒకనాడు నిశ్చింతగా నిద్దరోతూ కన్నుమూసేడు

"ఏమి అదృష్టం!" అన్నారందరూ.

"పిల్లా జెల్లా యిల్లూ వాకిలీ, అన్నీ వుండగా ఏ రోగం రొష్టూ లేకుండా, యిహలోకయాత్ర చాలించడంకన్న అదృష్టం ఏమిటి?"

కనకమ్మ కల్లోల సాగరంలా గగ్గోలుపెట్టి యేడ్చింది.

బండెడు సంసారం, కోడొకడు తీస్తే కొమ్మొకడు తీస్తాడు. ఈ పాడుకట్టె నీ భూమ్మీద వొదిలి భర్త వెళ్ళిపోయేడనీ తన నెత్తి నీ పాడు రాత పాడు దైవం రాసేడనీ, దుఃఖించింది.

కనకమ్మకి మొదటినించి, మునగచెట్టుమీద అపేక్ష్యత వున్నది. భర్త బ్రతికివున్న రోజుల్లో, అతగాడికి దానిమీదవున్న మక్కువ యెక్కువ అవడం నించి, ఆయన గతించిన తర్వాత కనకమ్మకి మునగచెట్టు యిష్టదైవమయింది.

కరకరా పొడుచుకొచ్చిన సూర్యుడు బారెడు మీద కెక్కేలోపునే కనకమ్మ చీపురూ చేటా పుచ్చుకుని, మొదట మునగచెట్టు ముంగిలి శుభ్రం చేస్తుంది.


ఆ రోజుకూడా ఆమె కార్యక్రమం అలాగే ఆరంభమయింది

ఆమె చీపురు నేలను బరుకూ బరుకూమని వూడుస్తున్నా, ఆ ధ్వనిలో, ఆమె వయసుమళ్ళిన నిస్సత్తువ స్ఫురిస్తున్నది

ఎద్దుల మువ్వలపట్టా భుజాన వేసుకని ఒకచేత కొరడా పుచ్చుకుని నారాయణ గుమ్మం దిగి 'ఎహెహె' అని యెద్దుల నదిలించేడు.

బండీ గట్టుకుని, ఛెంగున దానిమీదకెగిరి "అమ్మోయ్! పోతున్నా; పిల్లోయ్ రంగీ!...వస్తా..." నంటూ కేకేసి 'చల్ హె' మంటూ, ఎద్దుల నదిలించి బండి గరగరలాడ వెళ్ళిపోయాడు.

నారాయణ, కనకమ్మ మూడో కొడుకు. "రంగీ అని అతగాడు సంభోదించిన రంగమ్మ అతగాడి అర్ధాంగి ఇంకా పిల్లాపాపా కలుగని కారణంచేత రంగమ్మ గుమ్మందాకావచ్చి భర్త బండి దూరమవడం గమనించి వెనుదిరిగి వెళ్ళింది.




కనకమ్మ కొడుకువెళ్ళిన దిక్కున ఒకసారి పరికించి మళ్ళీ పూర్చడంలో నిమగ్నమయ్యింది.

“ధూత్ ! యెన్నిసార్లు చెప్పినా యెదవబుద్ధి...ఆ పాడు ‘పూరుబిండి’కంచం వారనుంచుతుందిగదా ?” అని విసుక్కుంటూ రాములు గుమ్మందిగి పోయేడు.

“అయ్యో! సామంతమా ! దాన్ని ఆట పక్కని నెట్టితిని పోరాదూ !” అని సావిత్రి భర్తవెనుక రెండడుగుల ముందుకి వచ్చింది.

రాములు మరింత ‘చ’ర్రుమన్నాడు. గుమ్మం దాటి, జేబులోనించి చుట్టతీసి కొరికి నోటబెట్టుకొనబోతూ, “అమ్మా ! పోతున్నా పన్లోకి... మాపటికిగాని రాను...” అంటూ తల్లి కేసి కేకేసి వెళ్ళిపోయేడు.

రాములు, రెండోవాడు సూరయ్య, కనకమ్మ దంపతులకి.

పాతికదాటి ముప్పై తొంగి చూస్తుందతని వయస్సు.

సావిత్రికి పూరుబిండి అంటే తగని యిష్టం. అందులోకి అది ఆమె పుట్టి నింటినించి తెచ్చింది ఎన్ని పర్యాయాలు తిట్లుతిన్నా, ఆమెకి భర్త విస్తరిచివర పూరుబిండి వేయకపోతే మనస్సు వొప్పదు.

ఖార్ఖానాలో పనిజేసే రాములు కటువుగా తిట్టకనూ మానడు. తన కొడుకు రాములు కూడు తినకపోయెనే అన్న ఆలోచనచేత కాబోలు, రెండు క్షణాలు నడుంమీద చెయ్యివేసుకు నించున్నది కనకమ్మ.

అంతలో మునగచెట్టుమీద కాకి వొకటి వాలి 'కాః కాః' యని రొదచేయగా, దాన్ని తోలి తన పనిలో పడిపోయింది.

"ఎదవనాయాళ! షావుకారు అగ్గిరుద్రుడవుతాడు... ఎదవకొంప నా చొక్కా యేదో...తతిమ్మావాళ్ళ కమీజులేవో తెలిసి చావదు. యీ దిక్కుమాలిందానికి తిండియావ తప్ప మరోటి లేదాయె."

చిందులు తొక్కి విసుక్కుంటున్నాడు సోములు. కాని భార్య నాగరత్నం అది పట్టనట్లు తాపీగా చద్దెన్నంతింటున్నది.

సోములొక పెద్దషావుకారు అంగడిలో నౌకరు.

'హోల్‌సేల్' మార్కెట్‌లో షావుకారుకెంత పెద్దచెయ్యో; నోరు అంత పెద్దది.

ఆలస్యమయితే నోరు కడుక్కుని తిడతాడు.

చివరికి కనకమ్మ చీపురవతల గిరవాటేసి వచ్చి, తన బిడ్డల చొక్కాలు తన కెంత గుర్తో చూపెందుకా అన్నట్లు "ఠపీ" మని అతగాడి లాల్చీ తీసియిచ్చి "ఇదుగోరా అబ్బీ! యిల్లాంటివి పెళ్ళాలు చూడాలిగాని నే నెన్నాళ్ళు చూస్తాను చెప్పు—" అంటూ గదిలోకి నడిచింది.

పెద్దకొడుకు సోములు తల్లిమీద పెచ్చు గౌరవంచూపే అలవాటు వున్నవా డవడంచేత చొక్కా వేసుకుని అవతలికి పోయేడు.

మూడంకె వేసుకుని 'వుహుఁహూఁ' అని హాయిననుభవిస్తూ, దుప్పటినిండా ముసుగుదన్ని నిద్దరోతున్నాడు శ్రీహరి.

"సీహరీ! బాబూ! లేవరా...బారెడు పొద్దెక్కింది ... అళ్ళందరూ ఎవరి పనులకు వాళ్ళు పోనేపోయినారూ"

కనకమ్మ కిది నిత్యమూ అలవాటే. శ్రీహరి అంత సుళువుగా మేల్కొంటా డని కనమ్మ కలనైనా అనుకోదు.

కుంభకర్ణుడినైనా నిద్రలేపడం సుళువే ... నిద్రనుంచి తెలివివచ్చిందో మరి ఆగడు గనక.

శ్రీహరి తెలిసుండే ఒకంతట మంచం దిగడు.

కనకమ్మ తిట్లూ దీవెనలూ, వాటికి తోడుగా ముగ్గురు తోటికోడళ్ళ దెప్పి పొడుపులూ, ఒక అరగంటయినా సాగందే, శ్రీహరికి సగం నిద్ర వదలదు.

"మడిసికి ఎన్నేళ్ళొచ్చినా, గ్నానం లేకపోయినాక ఏంటి లాభం" అన్నది సావిత్రి జనాంతికంగా.

వెంటనే ఆ మాటలను అందుకుని తతిమ్మా యిద్దరూ అందు కనుగుణంగా మూతులు తిప్పేరు.

కనకమ్మ కోడళ్ళ సూటిపోటి మాటలకు నొచ్చుకుంది.

"ఏం బావో తల్లీ! యిది నాకు గంపపుకోతగాని, యీ ఎదవకి వుజ్జోగమా? సజ్జోగమా? పోనీ బుద్ధా సుద్ధా ఏదీ లేదే? ఏ ఆడకూతురొచ్చి వీడితో కాపురం వుంటది?" అంటూ దిగులుపడ్డది.

మంచం దగ్గరకంటా నడిచి ఆ కసితో ఒక్కటి వీపున బాదింది.

శ్రీహరి ఆవలించేడు. మంచం పట పటలాడ వళ్ళు విరుచుకుని "ఎంత దెబ్బేసేవ్?" అంటూ లేచేడు.

"అమ్మోయ్! చద్దికూడెట్టివుంచవే! అయ్యగారిదో మొహం కడిగి వస్తున్నార"ని కేకేసి బయటికి నడిచాడు.

శ్రీహరికి వుద్యోగం లేదన్నమాటేగాని, నాలుగు వుద్యోగాలు మించిన వ్యాపకం వాడిది.

నాలుగు డబ్బులుండాలేగాని కారంసుఆటలో వాడికి పెట్టింది పేరు. మూడు ముక్కలాటంటే వాడు చెవి కోసుకుంటాడు.

* * *

కనకమ్మ కుండలోనించి గిన్నెలోకి అన్నం తోడుతూ వుండగా వెనకనించి శ్రీహరి ఆమె కొంగు నున్న బేడకాసు యిప్పుకుని చొక్కా చేతిమడతలో పెట్టేసుకున్నాడు.

వాడు కూడు జుర్రుతూవుండగా, కనకమ్మ కొంగుముడి విప్పి జూసుకుంది.

"ఓరి నీ చేతులుపడ! ఎర్రనేగానీ వుంచవుగద. గద్దలా తన్నుకుపోతావ్" అని దులిపింది

"ఛా! నోరు ముయ్యి! కావాలంటే జేబులు చూసుకో! ఆబిద్దం ఆడే రకం గాదు తెలుసా? యీ సీహరి కనకమ్మ కొడుకు యేమనుకున్నావో!"

కనకమ్మ జేబులు వెతికింది. ఆమెకి సంసారం బెంగంతా ఒక యెత్తూ, వీడి బెంగ ఒక యెత్తూను.

## 3

మురికిపేటఅన్న బిరుదు పట్టణంలోని యే పేటకయినా సర్వసాధారణంగా సరిపోతుంది.

పోతే సూరయ్య యిల్లు వున్న సందులూ ఒకటి రెండు తప్ప, తతిమ్మావి పూరిపాకలవడంచేత వాటికి నీరు పోవల్సిన కాలువల అవసరం అటు యింటిగల

వాళ్ళూ, యిటు మునిసిపాలిటీవాళ్ళు గుర్తించకపోవడంచేత మరింత మురికినీటి పళ్లేలుంటాయి.

పూరిల్లు అన్నతర్వాత పల్లెటూరయితే ఒకటీను, పట్నమయితే ఒకటీనా?

అందులో గాలికి, వెల్తురుకి జాగా వుండదు. వున్నమేర కాస్తా మనుషులటూ యిటూ మెదలడానికే చాలదు.

అంచేత స్నానమనీ, పడకలనీ, యిత్యాది మామూలు కార్యక్రమాలు సగం మంది రోడ్డుమీద స్వేచ్ఛగా జరుపుతారు.

ఆ వీధిలో జాగ్రత్తగా నడవకపోతే ప్రమాదాలున్నాయి.

పదేళ్ళలోపు పిల్లలంతా దేవతావస్త్రాలు ధరించి, రక రకాల ఆట లాడు కుంటారు.

వాటిలో ముఖ్యమయిన ఆటలు, తాజాగా విడుదలయిన సినీమాలో స్టంటు సీనులు.

కర్రా కంపో లేకుండా స్టంటు యేమిటి?

జట్కా ఖుద్దూస్ కొడుకు తండ్రిని కనుబాటుచేసి, జట్కాగూడు వెదురు బద్ద లాక్కొస్తే, బండి గురవయ్య కొడుకు కర్ర తస్కరించి పట్టుకొస్తాడు.

తెల్లనిదుస్తులు ధరించి, నీటైన యువకుడు ఒకతను సైకిలుమీద ఆ వీధి వెంట పోతున్నాడు.

ఒకవంక యింటి యిల్లాళ్ళు గుమ్మాలు వూడుస్తున్నందున, వస్త్రకాళం పట్టిన లాంటి దుమ్ము, అతని ముక్కులోనూ, కళ్ళల్లోనూ ఎత్తిపోస్తున్నది. మరొక వంక పిల్లలాటలాడుతూ, యింటి వరండాలో ఆడుకుంటూన్నంత నిర్భయంగా వున్నారు.

యువకుడు కొత్తగా పట్నవాసపు గల్లీలకు అలవాట్లుపడినట్లు లేదు.

ఫైరింజన్‌లాగ తెగ మోయించేశాడు బెల్లు.


రివ్వున ఒకడు పదేళ్ళ కుర్రవాడు సైకిలుకి అడ్డంవచ్చాడు.

యువకుడు సైకిలటు హేండిలుబారు తిప్పబోయాడు.

పదహారేళ్ళ మిఠారి ఒకతె ఖాళీ బిందెతో గుమ్మం దిగుతూ వస్తున్నది.

సైకిల్‌కి కుడి ఎడమలకి తిరగగల స్వేచ్ఛ వుంది 'ఠ'క్కున రెండు చక్రాల మీద ఆపగల శక్తి, యుక్తి ఆ యువకుడికి తెలీదు.

దురదృష్టవశాత్తు సైకిలు ఆ పిల్లదానికేసి వొరిగింది. కుర్రవాడిదేమీ గమనించనేలేదు. తుర్రుమని వాడి పనిమీద పారిపోయాడు



"ఓ లమ్మోయ్ !" అంది ఆ చిన్నది. సైకిలు కుర్రాడికి ముచ్చెమటలూ పోశాయి. సైకిలెక్కి పోబోయాడు.

"కళ్ళు నెత్తికొచ్చాయా !" ఇంటిముంగిలి మెట్లమీద కూచుని శ్రీహరి సైకిలువాలాని బెదిరించబోయాడు.

చదువుకున్న వాడవడంనించో, నాగరికత లక్షణాలు మోతాదు మించివున్న వాడవడంచేతో ఆ యువకుడు వెనుదిరిగి "లేదు ఆ సంగతి ఆ అమ్మాయినే అడగరాదూ ?'' అన్నాడు.

"ఏ సంగతిరా ?" అంటూ శ్రీహరి గుమ్మందిగి పైమీద తుండు నడుంమీద బిగించుకుని రోడ్డు మధ్యకి వచ్చేశాడు.

ఆ చిన్నది బిందె పుచ్చుకుని వెళిపోతూ, "పీడి జిమ్మడ ! మరీ మీద మీద కొచ్చేసిందు" అని శ్రీహరిమీద ఓ చిన్న నవ్వు విసిరి వెళ్లిపోయింది.

దాంతో శ్రీహరికి వెయ్యి యేనుగుల బలం వచ్చింది.

సైకిల్ని పట్టుకున్నాడు

"ఇది యిక్కడుంటది. నువ్వు షికారెళ్ళు" అన్నాడు.

"ఏయ్ ! నువ్వు అనవసరంగా తగువుకు వస్తున్నావ్, మంచిదికాదు."

ఆవేశాన్ని అణచుకుని, చూపుడు వేలుతో శ్రీహరిని మందలించబోయాడు యువకుడు.

అంతలో నలుగురూ పోగయ్యారు "రోడ్డు వాళ్ళ తాతగారి ముల్లె అయినట్టు, నవాబుల్లా తొక్కుతారు సైకిళ్ళు.. ఛీ ! యెదవ పొగరు."

వీరాయమ్మ వుమిసింది.

పార్వతి, సావిత్రి, నాగరత్నం అంతా విడ్డూరం చూద్దామన్నట్లు వచ్చారు.

సంధ్య కాంతులు చెరగి చీకట్లు వాలుతున్న వేళ, మగవాళ్ళంతా ఇంకా యిల్లు పట్టలేదు.

అంచేతనే శ్రీహరి మొనగాడయ్యాడు. ఇంతమంది ఆడబలగం విడ్డూరాన్ని, తన వీరత్వాన్ని చూడవచ్చినప్పుడు వెనక్కి తగ్గకూడదు.

యువకుడు, శ్రీహరితో.

"నా తప్పు యేమీలేదు, మొదటి సంగతి...రెండోది; ఆ అమ్మాయిని నేనేం చేయలేదు ... మూడోది ... నీకు ఆ పిల్ల యేమీ అవుతుందనుకోను ... అనవసరంగా పేచీ తెచ్చుకోకు"మని బోధించబోయాడు.

కాని, "ఆ ఆఁ ! యింకా చేసేదేంటీ పోకిరీ వాలకం ... మీద పడ్డావ్ చాలదూ !"

"ఛా ! ఛా ! యెందుకు సతికిన మొహంలాగుండావ్ !"

లాంటి వ్యాఖ్యానాలమధ్య అతన్ని శ్రీహరి లక్ష్యపెట్టలేదు.

బలవంతంగా సైకిలు గుంజాడు.

యువకుడు సైకిల్ని లాక్కుందికి ప్రయత్నించాడు. కాని తన యిస్త్రీ మడతలు నలగకుండా చూసుకున్నంత నున్నితంగా వుంది అతని ప్రతిఘటన.

శ్రీహరి హీరో ఐపోయి సైకిల్ తీసుకుని, యింట్లోకి నడవబోయాడు.

యువకుడు రెచ్చి కేకలువెయ్యక చేతిలోని మిఠాయి, గద్ద తన్నుకుపోతే, చూస్తున్న వాడిలా నించోడంతో ఆడవాళ్ళకి కొంచెం ఆశ్చర్యం, జాలి వేసింది.

"కాస్త వొళ్ళు దగ్గరెట్టుకుని తొక్కుతాడు, యిచ్చీరా సీహరీ !" అన్నది ఒకామె.

"వాడి బాబు రావాల !" శ్రీహరి కేక.

కనకమ్మ "ఒరేయ్ ! సీహరీ ముదనష్టపోడా ఎందిరా అది ?" అంటూ కేకలేస్తున్నా, శ్రీహరి "నువ్వుండెహె !" అని విదిలించాడు.

కోడళ్ళు తమకి యింత పిసరు పట్టనట్లు వూరుకున్నారు.

వ్యవహారం బాబులదాకా వెళ్ళడంతో యువకుడు కళ్ళవెంట నిప్పులు కక్కేడు.

"సరే !" అని ఆగ్రహంతో ముక్కి, అటే వస్తూన్న సైకిల్ రిక్షా యెక్కి వెళ్ళిపోయాడు.

శ్రీహరితోపాటు, అక్కడున్న జనం అంతా విస్తుపోయారు.

"పిరికినాయాల సైకిలొదిలేసి పారిపోయాడు" శ్రీహరి నాలిక తడిజేసుకుని మేకపోతు గాంభీర్యం ప్రకటించాడు.

కనకమ్మ "ఓరి సచ్చినాడో !" అని కొడుకుని తిడుతూ.

"ఏవండోయ్ ! అబ్బాయ్ ! యిదో అబ్బాయ్ !" అంటూ రిక్షా వెనక పడబోయింది.

సైకిలు మునగచెట్టు క్రింద పెట్టాడు శ్రీహరి.

వాడిలో ఎందుకో తెలియని భయం ఆవహించింది.

బీడీ దమ్ము తెగపీల్చినా లాభం లేకపోయింది. నుదుట చెమటపోసింది.

సినీమాలో అయితే వెంటనే ఆ చిన్నది తనను ప్రేమించేసునుగాని, యిక్కడ అలాంటిదేం జరగదు.

ఏమంటే వాడికి తెలుసు. ఈ కథకి మూలకారణమయిన వెంకట్రవణ అన్న, వొట్టి రౌడీ. అతగాడంటే శ్రీహరికి హడలు.

అంచేతనే వెంకట్రవణకేసి చూడ్డానికి కూడా అప్పుడప్పుడు శ్రీహరి సాహసించడు.

క్షణాలు గడిచినకొద్దీ పెరిగే బరువైన చీకట్లలాగ శ్రీహరిని భయం అలుముకోసాగింది.

## 4

"ఆ యింటికి ఆ ముదనష్టపు మునగచెట్టూ, యీ తిండి దండగపోరడూ పోతేగాని శని వొదల్దు."

పార్వతి భర్తకి, కంచంపెడుతూ చెప్పింది.

"ఏ మొచ్చిందే మళ్ళా!" మంచి ఆకలిమీద వున్నాడు రాజయ్య.

"ఎదవ ! పోనిద్దూ. సందెవేళ ఆ అబ్బాయి ఎవరో సైకిలుమీద వెడుతూంటే సైకిలట్టుకుని యింట్లో పెట్టుకున్నాడు."

పార్వతి భర్తకి ఆ సాయంత్రం జరిగిన వుదంతం పూసగుచ్చినట్లు చెప్పింది.

అంతలో మునగచెట్టు యింట్లోనించి కేకలు వినిపించాయి.

"ఛీ ! అడ్డగాడిదలా తిని తిరగడమేగాకండా ఎదవ వూళ్లో తగువులుకూడా తెస్తున్నాడు."

ఉగ్రుడై చిందులు తొక్కాడు పెద్ద కొడుకు.

"ఈ ఎదవ గాడిదని మక్కెలిరిచి చావచంపుతేగాని ఓనాడు నే నూరుకోను" అన్నకి సాయంగా మూడోవాడు వచ్చాడు.

"ఆఁ ! అనడమేగాని ఆయనగారికి చీమేనా కుట్టదు. దొరగారల్లే వుంటాడు. నోటి తీపులే మిగులు" మూతి తిప్పింది అతగాడి భార్య రంగమ్మ.

"తిండి యేళకి తిండీ, పడక యేళకి పడకా అమరతావుంటే, నెత్తి నెక్కి తాండవమాడ్డా ? మా పోలి మా మాంచిదంటే గుడి సెక్కిందిట" అంటూ వచ్చింది నాగరత్నం. వచ్చి భర్త నులకమంచం వటన నేలపడేసి "ఐనా, మన గోలెవరికిలే అయికమత్తాలు అంటూ వాళ్ళు పడి చస్తూండగా" అంది.

"ఎదవెక్కడ సద్చాడు ? ఆ సైకిల్నీ వాడినీ కూడా మెడట్టి గెంటేస్తే పోతుంది పీడ" చుట్టకొరికి తుపుక్కున వూసి నోట బెట్టుకున్నాడు నారాయణ.

"ఎందుకొచ్చింది ! మన దారిన మనం పోదాం రామాంటే" సణిగింది సావిత్రి.

కనకమ్మ కోడళ్లూ, కొడుకులూ కలిసి శ్రీహరిని తిడుతున్నంతసేపు మధ్యలో కల్పించుకుని వారించబోయిందిగాని, ఆమెకి నోరు పెగిలింది కాదు.

ఎన్నో పర్యాయాలు యిదివరకు "ఏదో పిల్లతనం. నాలుగురోజులుబోయి నాక, వాడూ మీలాగే అవుతాడులే" అంటూ శ్రీహరిని వెనుక వేసుకునివచ్చి, తతిమ్మావాళ్ళని కూకలేసే కనకమ్మ కావేళ నోరు పడిపోయినట్లయింది.

తాను ఎంత వారించినా, ముదనష్టపు ఎదవ యిన్నాడే కాదే అని పదే పదే గొణుక్కుంది. 'శ్రీరామచంద్రా వీడెలా బాగుపడతాడురా' అని భగవంతుణ్ణి తలపోసింది.

"మీ మొహాలు, కబుర్లసొరవేగాని పనికాడికి వచ్చేసరికి ఎర్రి మొహాలే అతగాడు యింటబడేసతికి. ఆ యమ్మాకొడుకు లేకమయితే ... ఛీ !" అని

తన భర్త చాతకానితనాన్ని, మరుదుల పిరికితనాన్ని కలిపి దెప్పిపొడిచింది, నాగరత్నం

దాంతో నారాయణందుకుని "అదే ... అదే వొదినా ! చూస్తావ్‌గా ! ఎదవ గాడిదని యియ్యాల మక్కెలిరగపొడుస్తా" నంటూ లేచాడు.

"అసలింతకీ ఎక్కడ మట్టిలో కలిశాడే దున్నపోతు గాడిదః,"టూ సోములు లేచి, "ఒరే సీహరీ ! ఒరే సీహరీ !" అని కేకేసేడు ప్రక్క గదిలోకి చూస్తూ

కనకమ్మ నుద్దేశించి "ఏడీ నీ ముద్దుల కొడుకు ? మక్కెలిరగపొడిచియాల" అంటూ, ముగ్గురు కొడుకులు కసురుకున్నారు.

కోడళ్ళు కూడా రంగంమీద ఆయా జాగాల్లో కత్తిగట్టి యీ పనికి పూనుకున్నారు ఎడం యెడంగా.

"ఏమోరా ! ఎదవ సచ్చినోడు కూడు కూడ తిన్లేదు. అట్టా బయటిగ్గాని పోయాడేమో" అంది లేచి వీధి గుమ్మంలో కెడుతూ.

"అయినా, వాడే చేసిందానికి సగం పేనాలతో కుములుతున్నాడు," అంది కనకమ్మ. ఆమె వుద్దేశ్యం తతిమ్మా కుటుంబానికి ఆమె అన్న చివరి మాటలు శ్రీహరిమీద సానుభూతి కలిగిస్తాయని.

గుమ్మంలో చతికిలబడి "అన్నలొస్తే చెప్పకే, చెప్పకే అని యెంత బాధ పడ్డాడో తెలుసా ?" అన్నది.

"వుహూఁ ! సినీమాలున్నాయ్‌గా పోకిరి నాయాళకి. దర్జాగా వెళ్లంటాడూ. మరి యీ గుమ్మం తొక్కొద్దని చెప్పే ఆడికి."

నారాయణ సావిత్రి కేసి తిరిగి హుకుం జారీచేశాడు.

"మరేం...మీరూ మీరూ ఆనక ఒకటే. పాములు పాములూ కరచుకుంటే విసాలా ? అని, మద్దెలో మా ఆడ సచ్చినోళ్ళే సచ్చేది."

మొత్తంమీద మరి రెండు గంటలదాకా కొడుకుల కోపమూ, కోడళ్ళ వ్యాఖ్యానాలు రెండూ చల్లారలేదు.

ఆరు బయట మంచం వేసుకుని చుట్టలు కాల్చుకుంటూ మెలిమెల్లిగా అన్న దమ్ములు అందరూ నిద్దరలో పడ్డారు.

కనకమ్మకి కునుకురాలేదు. 'బయటనున్న ఆ సైకిలు. ఈ అదను చూసు కుని, ఏ దొంగాడేనా తీసుకుపోతే, పొద్దున సీహరి గతేమిటి ?'

శ్రీహరి గురించి ఆమెకి బెంగా, భయమూ యెక్కువయ్యాయి.

"ఈ కొంప నింక యెన్నాళ్ళో సర్దుకు రాలే"ననుకుంది.

"ఇంతకీ దేవుడి దయ ఎలాగుందో !" నని నిట్టూర్చింది.

ఒక రాత్రివేళ శ్రీహరి వచ్చి యింట్లోకి పిల్లిలా జొరబడుతున్నప్పుడు ... కనకమ్మ తెలిసేవుంది.

"ఎవరూ ? సీహరీ !" అన్నమాటలు బలవంతంగా ఆపుకుంది.

ఉదయం మాత్రం యీ రగడ జరగదా ? అయితే మాతృ వాత్సల్యం అలాంటిది. అప్పుడు దైవమే కాపాడుతాడు. కనకమ్మకి సైకిల్ని ఏం చేయాలి ? అన్న ప్రశ్న తట్టినప్పుడు గుండెల్లో వణుకు వచ్చింది.

కన్నుమూత పడేసరికి పోలీసులు ప్రత్యక్షమయ్యారు, ఆమె కట్టియెదుట.

ఆమె నిద్రపోడానికి భయపడ్డది.

## 5

కనకమ్మ భయం నిజమయ్యింది. తెల్లారిన తర్వాత యింకా ఒకటో రెండో సైరన్లు కూశాయి... రోడ్డుమీది మందాల నింకా కనకమ్మ కుటుంబం యింట్లోకి చేర్చనేలేదు.

ఇద్దరు పోలీసులు, ఒక యువకుడూ కనకమ్మ యింటి ముందుకు వచ్చి ఆగారు.

"ఇదే, యీ మునగచెట్టు యిల్లే !" నన్నాడు యువకుడు.

సైకిల్ దొంగతనం చేసిన నేరం క్రింద శ్రీహరినీ, దొంగ సొత్తుతోసహా పట్టుకుంటున్నామని పోలీసులు చెప్పారు.

కనకమ్మ కుటుంబం వొక్కటే కాదు, ఆ వీధిలోని జనమంతా పోగయ్యారు అక్కడికి.


పోలీసులు రావడమంటే మాటలా ?

కనకమ్మ పోలీసుల కాళ్లమీద పడ్డంతపని చేసింది.

ఆ యువకుడిని పట్టుకుని ఏడుస్తూ "యీ తప్పు క్షమించమని" బ్రతిమాలింది.

"ఇది పోలీసుల చేతికొచ్చింది. ఆయన కూడా చేసేదేమీ లేదు" అని పోలీసులు కనకమ్మని గదమాయించారు.

అన్నల్లో ఒక్కడైనా కిక్కురుమనలేదు! ఏమంటే ఏం పీకేకి, చుట్టుకుంటుందోనని బిక్కు బిక్కుమంటూ పూరుకున్నారు.




జనం రకరకాలుగా గుసగుసలు, వ్యాఖ్యానాలు సాగించారు. ఒక్కరైనా, ఆఖరికి నిన్న సాయంకాలం ఏ చిన్నదాని కోసరమైతే శ్రీహరి యీ సాహసం చేసాడో దాని అన్నయ్య కూడా, సానుభూతి చూపలేదు.

ఆ యువకుడు మామూలుగా పోలీసు స్టేషనుకి వెళ్ళి రిపోర్ట్ యివ్వలేదు. అతగాడికి ఒక వేలు విడిచిన మేనమామ సర్కిల్ యిన్స్పెక్టర్ వున్నాడు. అక్కడికి వెళ్లాడు.

శ్రీహరి బయటపడాలంటే వచ్చిన యిద్దరి పోలీసుల చేతులూ పనికిరావు. ఆ సర్కిల్‌గారి అనుగ్రహమే తప్ప సాక్షాత్ దైవం కూడా అతన్ని రక్షించలేదు.

శ్రీహరిని తీసుకుపోతూంటే కనకమ్మ గుండె బాదుకుంటూ విలపించింది.

* * *

## 6

ఓకి యెన్ని వొంకర్లో తెలీని సూరయ్య కనీసం మెట్టపొలమేనా అరెకరంలేని సూరయ్య యిల్లు నిలబెట్టుకొని, కొడుకుల్నింతలేసి చేసి, కూతుర్ని అత్తింటికి పంపి, గతించేడంటే, అతని సమర్థత తెలుస్తుంది.

ఇల్లు కట్టడం, దాని ముంగిలి వాకిట మునగచెట్టు నాటడం కూడ సూరయ్య జీవితంలో అతి ముఖ్యమయిన ఘట్టాలే.

ఇల్లు కట్టి చూడమన్నారు. పెళ్ళిచేసి చూడమన్నారు. ఆ రెండూ సూరయ్య చేసేడు. అంతేకాదు, కళ్ళారా ఆ మహోత్సవాల నతగాడు నాలుగు పర్యాయాలు జరిపించాడు.

సోములు పుట్టిననాటికి, సూరయ్య బండి తోలుతూ వుండేవాడు. బండి తోలడంలోనేకాదు. దానిమీద బ్రహ్మరుద్రాదులకి తెలియకుండా వస్తువులను చేరవెయ్యడంలో కూడా అతగాడు అతి సమర్థుడు.

బండి తోలుతున్న రోజుల్లో అతగాడికి బడ్డీ దుకాణంమీదికి మనసు పోయింది.

బండీ పూర్తిగా వొదిలి, బడ్డీ దుకాణంతో మిఠాయి దుకాణం, యెలక్ట్రిక్ దీపాలతో తయారయ్యేసరికి ముగ్గురు పిల్లల తండ్రి అయ్యేడు సూరయ్య.

కనకమ్మ విడకలు పెట్టి అమ్మడం మానేసింది. వంద అర్ధరూపాయి దగ్గర్నుంచి ముప్పావలాదాకా రేటు వున్న రోజుల్లో, కనకమ్మ తన వ్యాపారం విరమించుకుందీ అంటే సూరయ్య గౌరవ ప్రతిపత్తులెంత పెరిగాయో గ్రహించ వచ్చును.

సూరయ్య మిఠాయి దుకాణంలో కూచున్నా, ప్రపంచపోకడ ఏమీ తెలియని వాడు కాదు. అందులోనూ అతడు వుంటున్నది మహాపట్నంలో.

తన పిల్లల గురించి, వాళ్ళ బాగోగుల గురించి మొట్టమొదటిసారిగా బెంగ పెట్టుకున్నాడు సూరయ్య ఒక వుదయం పూట.

అదేరోజున పెద్దాణ్ణి బళ్లో పెట్టించాడు.

''నాలుగు ముక్కలు సతికితే గాని...ముందొచ్చేది ముండాకాలం బతకనేరు" అని భార్యకి చెప్పాడు.

అసలు సూరయ్యకి పాపభీతి వున్నది.

ఆవేళ అతగాడు ఒక దొంగ నగ కొన్నాడు. మొదట కొనకూడదు అనుకున్నాడుకాని, తులం నూట బంగారం పాతిక రూపాయలకు వస్తూంటే నోరు, దాంతోపాటూ మనసూ కూడా వూరిపోయాయి.

సూరయ్యకి పైసా పైసా కూడదీసి రూపాయి చెయ్యడం అంటే గొప్ప కష్ట మనిపించింది.

కనకమ్మతో రోజుకి ముమ్మారు సరసాలాడి "ఛా ! ఏంటిది ? ముగ్గురు బిడ్డల తండ్రివి" అనిపించుకునేవాడు. ఎప్పుడూ దీర్ఘాలోచనలో మునిగిపోయే వాడు రాను రాను...

'దొంగ నగలు, దొర నగలు అని వుంటాయా ! బంగారం మహాలక్ష్మి. దీనికి మంచిచెడ్డల నంటగట్టడం బుద్ధి తక్కువ' అని బుద్ధి చెప్పుకున్నాడు సూరయ్య.

మిఠాయి కొట్టుమీద అతగాడి మోజు తగ్గింది.

కనకం మూడో నెల గర్భవతి కావడంతో పెళ్ళాంమీద మమకారం తిరుగు మొహం పట్టింది.

కాని, పిల్లలమీద మాత్రం సదా ఒక కన్ను వేసివుంచేవాడు.

## 7

సూరయ్య ఒకనాడు వుదయమే లేచి, బొడ్డులో ఏదో దోపుకుని బయటికి వెడుతూవుండగా, మూడోక్లాసు చదూతున్న సోములు, ఒకటోక్లాసుకి వెళుతూవున్న రాములు యిద్దరూ గోళీకాయ లాటలో పరవశంగా వున్నారు.

సూరయ్య వుగ్రుడై పోయాడు పీక పిసుక్కున్నట్లయ్యింది.

"నదువు సందెల్లేకుండా ఎదవలు" పళ్ళు పట పట లాడించాడు.

ఎనిమిదేళ్ళ తర్వాత, తను పూర్వం వాడుకునే కొరడాను తీశాడు.

ఆవేళ కనకమ్మ గనక అడ్డుపడి దెబ్బలు సగం భరించకపోతే, కుర్రవెధవ ప్రాణం ఎగిరిపోయేదే.

సూరయ్య ఎన్నడూ చదువుకోలేదు. ఇటీవల అతనికి చదువు అవసరం తెలిసి, దానిమీద మోజు కలిగింది.

తన కొడుకులు పెద్ద చదువులు చదవాలన్న కోరిక; అతనికి లక్షాధికారి కౌదాము అన్న కాంక్ష అంత ప్రబలంగానూ, పాతుకుపోయింది.

కనకమ్మ అదివరకు భర్తచేత దెబ్బలు తినకపోలేదు.

కాని ఆవేళ తన పిల్లల్ని అంత వొళ్లూ పై తెలీకుండా బాదుతూంటే రోదిస్తూవున్నదల్లా వుగ్రురాలై, నిలువెత్తున లేచింది.

"మనిషా గొడ్డా ! నీ చేతులు పడ !" అని సూరయ్య గుండెలమీద రెండు చేతులా మొత్తింది.

సూరయ్య భార్య తిరుగుబాటుకి క్షణం దిమ్మబారి, తెలివి తెచ్చుకుని "నా కొడుకులు ! నా కొడుకులు, నాలాంటి దొంగ తొత్తుకొడుకులు కారాదు" అని అవతలికి పోయాడు.

అయితే సూరయ్య పట్టుదల ఏ ఒక్క కొడుకునీ, ఎనిమిదో తరగతి దాటించలేకపోయింది.

ఆ పేటలోని హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలో మరి చదువులేదనిపించి, సోములు, రాములు, నారాయణ ముగ్గురు, తమ జీవిత పంథాలను స్థిరపర్చుకున్నారు.

ఈలోగా, శ్రీహరికన్న పెద్దదీ, నారాయణ తరువాతిదీ కొండలు పెళ్ళీడు కెదిగింది శ్రీహరి అయిదోక్లాస్లు మూమ్మారు చదివి విసిగిపోయాడు.

సూరయ్య కూడా ప్రొహిబిషను రావడంతో, తనకు ముఖ్య వ్యాపారాంగ మయిన సారాదుకాణం మూసేవల్సి వచ్చింది.

అయితే అతగాడు యిప్పుడున్న మునగచెట్టు యిల్లు కడుతున్నాడు అప్పటికి.

అంచేత రహస్యంగా సారాయి వ్యాపారం చేయవల్సి వచ్చింది.

అంతేకాదు, కొడుకుల ముగ్గురికీ మూన్నెళ్ళ వ్యవధిలో పెళ్ళిళ్ళు చేశాడు. మగపిల్లల తండ్రి అవడం సూరయ్య అదృష్టమేగాని, ఆ అవకాశాన్ని అవస రానికి వాడి యిల్లు పూర్తిచెయ్యగలగడం అతగాడి ప్రయోజకత్వమేనని ఒప్పుకోవాలి

## 8

అన్నివిధాల సమర్థుడైన భర్త బండెడు సంసారం తన నెత్తిన పెట్టిపోయాడే అని, గతాన్ని తలపోస్తూ కూచున్న కనకమ్మకు మాతృహృదయంలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది

"పిల్లలు ఎవరికివాళ్ళు అయినారు" అని గొణుక్కుంటూ లేచింది

నిజమే ఆవేళ మామూలు అలజడీ, కేకలూ లేవు.

కొడుకులు ముగ్గురూ, మూతులు కుట్టేసినట్లు మౌనంగా పనులమీదకు పోయారు. కోడళ్ళు చెడపువేసినట్లు మసలుతున్నారు తప్ప, కనకమ్మ దగ్గిరి కొచ్చి మాటడలేదు ఒక్కరయినా.

కనకమ్మ యింటికి వున్నవి నాలుగ్గదులు ఆవీ గగుల పెట్టెలో అరాల్లాం టివి తప్ప, ఏర్పాటుగా లేవు.

ముందు వరండా, దాని కొసని వంటకొట్టు. ముంగిలి వాకిలే పెద్దది. అదీ గాక అది ఒకవేపు వెడల్పుగా వుంది. సాధారణంగా కనకమ్మ కోడళ్ళ సాయంతో ఆరుబయట మునగచెట్టు సమీపాన వంట సాగిస్తూంది.

రెండో దిక్కున ; రాజయ్య యింటి నానుకొనే గోడ వున్నది.

ఆ యింటి మనుషు లీ యింటి వాళ్ళకి అగుపించరు అన్నమాటేగాని, ఒండొ రుల మాటలు వృష్టంగా ఆలకించవచ్చును.

రాజయ్య పనిలోకి పోయాడేగాని, పార్వతికి వెంటనే పని తెమిలిందిగాదు. ఆమె మినప్పప్పు రుబ్బి, వడియాలు పెట్టటంలో నిమగ్న మైంది.




పప్పు రుబ్బి, బోలెగిన్నెలోకి తోడుతూవున్నా, ఆమె చెవులుమాత్రం పొరుగు వాటామీదనే వున్నాయి.

కనకమ్మ దేముడికొట్టులోకి వెళ్ళింది. పాతదైన కానిడిపెట్టె నొకదాన్ని తెరిచింది.

అందులో బట్టల అడుగున అటు ఇటూ వెదికి, బంగారు కంటెను తీసింది. దానిని కొంగున కట్టి ముందుకు తిప్పి బొడ్డులో దోపుకుంది.

కొంచెంసేపు తటపటాయించింది గాని "బాబూ! సిహరీ మీ యమ్మ ఇంకా వుందిరా భూమ్మీద" అనుకుని నిర్ధారణగా బయటికి వెళ్ళిపోయింది.

తల్లి ప్రాణం అలాంటిది, అత్తగారు వెళుతున్నప్పుడు కూడా కోగళ్ళు కిక్కురుమనలేదు.

ఆమె అటు వెళ్ళగానే వ్యాఖ్యానాల కందుకున్నారు.

అవతలయింట పార్వతి కూడా ఎంతటిమాట లివతలి వేపునుంచి వస్తాయన్నట్లు వున్నదేమో, రుబ్బుతున్న పొత్రాన్ని అట్టేవుంచి వినసాగింది.

"ముసిల్ది, ఆఖరి కొడుకంటే పడిఛస్తుందే!" అంది సావిత్రి.

"కొంపంతా గుల్లచేసి ఆడికెట్టందే యిది నిద్దురోదు. అసలింతకీ ఎవర్నీ అనాల్సియాముందిలే! మన రాత... మన మగాళ్ళనక"

వేరింటి కాపురంపెట్టలేని మొగుడిమీది కసిని వెలిబుచ్చింది నాగరత్నం.

"అయినా గాపోయినా, ఆ పిల్లాడికి మరీ పొగరు. సైకిలు తెచ్చి మొనగాడల్లే యింట్లో పడేశాడు!" ఉడుకు నొక్కుకుంది రంగమ్మ.

"అందుకేగా అయ్య వెళ్ళేడు కటకటాల వెనక్కి" ముగ్గురూ శ్రీహరికి తగిన శిక్ష పడిందన్న తీర్పు సూచిందారు.

పార్వతి వీళ్ళ మాటలాలకిస్తున్న వేళ గాలి కాస్త సాగింది మునగచెట్టు ఒక సారి వొళ్ళు దులుపుకుంది.

మునగాకు తెల్లని మినప్పప్పు చోవి మీద పచ్చగా ముచ్చటగా పడ్డది.

పార్వతికి వుక్రోషం వచ్చింది. వొళ్ళు మండిపోయింది.

"పాడు ముండా సంత!'' అని అనవసరంగా, కోపళ్ళను తిట్టుకుంది, అదీ గట్టిగా.

''ముదనష్టపు చెట్టు, పీకి పారేయించరు. ఛీ!"

మొదట ఆ మాటలు, సావిత్రి చెవికెక్కాయి.

"అప్పా అన్నావటే! పార్వతమ్మ మాట; ఎవర్నే ముండలంటదీ"

నాగరత్నం రెండో మాటమీద కోపం చూపించింది. ''పచ్చని మాలక్ష్మి చెట్టు! అంటే దాన్ని ముదనష్టపుది అన్నాళ్ళ నోరుపడ".

పార్వతి కళ్ళవెంట నిప్పులు కురిశాయి. రోటిదగ్గర్నుంచి అమాంతం లేచి "ఓ యబ్బో! అత్తకి అగ్గి, మొగుడికి మొద్దులా పెడతారు. యూళ్ళ చెట్టునందే వచ్చిందిరా ఇంత మూరెడు"

ఇక యిరుపక్షాలూ గోడ కటూ యిటూ వుండడాన్ని సహించలేకపోయాయి పార్వతి తన గుమ్మంలో నించుంటే ముగ్గురు తోడికోడళ్ళు వాళ్ళ గుమ్మంలో నించున్నారు

"అమ్మోయ్! కావాలంటే నీ కొంప కాళీ చేసిపో! మా చెట్టుని ముదనష్టపుది అన్నావంటే వూరుకొనేది లేదు" చూపుడువేలు చూపించి, మరీచెప్పింది నాగరత్నం

"తేరున్నర పప్పు చోవి మంట గలిపిందే! నీ పాడు చెట్టు" పార్వతి వెక్కిరించింది.

"మా తెట్టుకేలాపోయావ్? లేదా నీ అయనకి చెప్పి పందిరేయించుకో!" సావిత్రి అందుకుంది చేతికి మినప చోవి వుండడాన్ని మండతో ముంగురులు మీదికి నెట్టుకుని "ఏయ్. జాగ్రత్త! మగాళ్ళమాట రానీకు' అంది పార్వతి.

'అబ్బో! నీ మొగుడు!" ఏమనాలో తెలీక చేతులు తిప్పింది సావిత్రి.

''ఒక్కాగా నొక్క మరిదిని, పాడుముండాసంత రానిరంపానెడుతున్నా" రంది పార్వతి.

దాంతో తగువు తమాషాగా మారిపోయింది. పూనకం ఎత్తిపోయింది కోడళ్ళ ముగ్గురికీ ముగ్గురూ పార్వతిని తమకి సవితి వన్నారు. పార్వతికూడా తక్కువ తినలేదు మెటికలు విరిచి మరీ ఆ ముగ్గుర్నీ సవతుల్ని జేసుకుంది.

నలుగురూ మూగారు

మునగచెట్టుకూడా ఏ పక్షం వహించిందో తెలియదు గాని కాయ రాలి పడ్డది

యిరుగు పొరుగుల ఆడవాళ్ళుకూడా మధ్య మధ్య రంగం మీదికి దిగడంతో ఆ మొగసాల రణరంగ మయింది

భాష సృష్టించినవాడికి కూడా భేదించ శక్యంగాని పదజాలం పుంఖాను పుంఖాలుగా వాడారు యిరుపక్షాలూ.

చివరికి నోళ్ళు తీపులు, వొళ్ళు పులుపులూ మిగిలాయి.

## 9

కనకమ్మ కంటె, పోతే పోయింది, కొడుకు దక్కేడన్న సంతోషం వ్యక్తపరిచింది.

"ఇక మీదటయినా బుద్ధిగా మసలుకోరా బాబూ! ఎక్కడేనా కాయకష్టంపడి నాలుగురాళ్ళు తే. మీ అన్నలు చూడు, మా రాజుల్లా మాటాడుతారు.. అంతేరా బాబూ! మగాడివి గనక పుజ్జోగం, పెళ్ళీ ఈ రెండూ దర్జాగా చేసుకోవాలి ..."

హితబోధ చేసింది

"ఎహె నా భాగం నాకు పారేమను. నువ్వు నాకు వొదెట్టు యీ లోగా మనం చూడు! కొన్ని వందలు...హా హా! వందలేంటి? వేలు సంపాదిస్తా."

శ్రీహరి బీరాలు తగ్గలేదు

కనకమ్మ శ్రీహరితో యిల్లుజేరేసరికి మిట్టమధ్యాహ్నమయింది ఎండ నిప్పులు చెరుగుతూంది

శ్రీహరి "అమ్మా! ఆళ్ళతో మనకి పేచీలొస్తాయ్! ఈ పూటకి హోటల్లో తినివస్తాగాని రూపాయుంటే పడేయ్" మన్నాడు

"ఎదవలు కలియబడి కొట్టుకుంటారు. ఎందుకొచ్చినపీడ" అనుకుని రూపాయి శ్రీహరి చేతబెట్టి "మాపిటికి యింట తగలడు. అన్నలకి నెమ్మాపణ చెప్పుకోమ"ని మందలించింది. వాడు రూపాయి చూడగనే తుర్రుమన్నాడు.

* * *

మునగచెట్టుక్రింద పొయ్యిమీద పెద్దకుండలో యింకా అన్నం తెర్లుతున్నది అది వుడికి వార్చేందుకి మరి పదినిమిషాలేనా పడుతుంది.

కనకమ్మకి ఇంట్లోని పరిస్థితులు అవగాహన అయ్యాయి. కోడళ్ల ముగ్గురు కొడుకులను తనమీదికి వుసిగొలిపి కూర్చున్నారన్న మాట.

"ఇవతల మాకు బ్రతుకులున్నాయ్! అని ఎరగదా ఆమె?... కొంపలో యెక్కడేమున్నాయో చెప్పి యింత వుడకబెట్టి పారేయ్‌మని చెప్పిపోరాదా?"

సోములు చిందులు తొక్కుతున్నాడు.

ఛా ఛా! ఎదవదానా! దానికి కొడుకులమీద మమకారం అదీ పోయిందే నీవేనా?? మొగుడిముద్దకి నువ్వే ఏదో యింత వుడకబెట్టలేకపోయావు!" అని నారాయణ పెళ్ళాం కొప్పు పట్టుకున్నాడు. రంగమ్మ విజృంభించింది.

"ఏందో శాస్త్రం చెప్పినట్టుంది అళ్ళంతా వుండగా నామీద సామంతల్చ అత్తగారుండగా, పెద్దకోడలుండగా, చిన్నకోడలుండగా ఈ యింటి దాసీదాన్ని నేనేంటి చేసేది నా మోహం..."

"అవునులే వాళ్ళకేంటి మారాజులు, మారాణులు..." నారాయణ వదినె గారిని వురిమి చూశాడు

"ఆఁ,ఏంలేదు నాయనా! ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములూ అన్నట్లు రంగకంటె నాకు పెత్తనం ఇక్కడ పొర్లిపోవడం లేదులే" వ్యాఖ్యా నించింది నాగరత్నం.

"ఎహెఁ ఎదవగోల... అవతల డూటీలకు యేళయిపోయి చస్తాపుంటే పాడు సంత..." రాములు మండిపడ్డాడు.

"అదేనోయ్! మా ఏడుపూను నీకొక్కడికే ముండ వుద్యోగం..."

సోములు కోపంతో అనవసరంగా తమ్ముళ్లతో తగువు కొనుక్కున్నాడు.

రాములు 'ఇంకొక్కమాట అను నీ పీకె కొరికేస్తా' నన్నట్లుగా చూశాడు అన్నయ్యకేసి.

కనకమ్మ పల్లెత్తుమాట అనలేదు. వీళ్ళంతా యిలా క్రిందా మీదా అవుతూ వుండే అన్నం వార్చింది.

"అలా మగాళ్ళతో తలపడి వాదంచేయకపోతే నాలుగు పనులూ అందుకో రాదటే" అని గొణుక్కుంది.

ఆ మాట మొదట సావిత్రి చెవిని పడ్డది.

ఆమె లేచి గదిలోకి పోయింది. తాత్కాలికంగా కలతలు సమసినప్పటికీ తప్పించుకుపోయిన శ్రీహరిమీద ఇంటిల్లిపాదీ కసిగానే వున్నారు.



## 10

"ఉత్త బండ నయం నా మొగుడుకంటె" బియ్యం యేరుతూ తల మొత్తుకుంది, పార్వతి.

"ఎందుకనో" చుట్టని రంజుగా కాలుస్తున్నాడు రాజయ్య

"నా పిండం"

"అసలు సంగతేందే?" రాజయ్య గట్టిగా అరిచాడు.

"ఎదవ మునగచెట్టు యివాళ నా మినప్పప్పు, వొడియాలు పాడుచేసింది. ముమ్మారు వూడ్చేసరికి నా నడుం పడిపోతావుంది. పైగా మునగచెట్టు మహలక్ష్మంట. దాన్ని తిడితే కళ్ళుపోతాయట! వీళ్ళ జిమ్మడ" గాజులు గరేళ్మన చేతులు విరిచి తిట్టి చెప్పింది పార్వతి. "పొద్దున్న నువ్వటు పోగానే ముండసంత నా మీద గంయ్యమని విరుచుకుపడ్డారు.

రాజయ్య మాట్లాడుదామని పెదవులు తడిచేసుకొని, నాలిక చప్పరించి పూరుకున్నాడు.

పొరుగు నున్న నలుగురూ. బకాసురుల్లాంటివాళ్ళు. వాళ్ళతో ఒంటరిగాడు తాను పోట్లాటకి దిగి సాధించగలది యేమాత్రమో, రాజయ్యకి తెలుసు

"పోనిద్దూ కుక్కని ట్లో సారు యెపరెట్టమన్నారు మనల్ని" అన్నాడు. భార్యని సమర్థించడానికి.

"మరేం...అంచేత కుక్కలు మొరుగుతున్నా విని వూరుకోమంటావు. ఛీ మగతనం!" చులిపేసింది పార్వతి "కుక్కకాటుకి చెప్పుదెబ్బన్నారు" అని భర్తని వుసిగొల్పింది.

రాజయ్యకికూడా ఒళ్ళు మండింది.

"ఎదవ మునగచెట్టును ఓ రాత్రిపూట నరికేస్తా..." నన్నాడు కసిగా.

పార్వతికి భర్త నిస్సహాయత అర్థమైపోయింది. అంతేకాదు, అదివరకటి సంఘటన ఒకటి దాని వెనుకనే జ్ఞాపకానికొచ్చింది.

ఓ! రోజున జోరున గాలివీచి అటుతర్వాత హోరున వాన కురియక నాలుగు చినుకులు రాలి వూరుకుంది.

మునగాకు మోపెడురాలి, చినుకులకి తడిసి మోపెడయింది.

నాగరత్నం దానిని తిట్టుకుంటూ వూడిచి, పక్కింటి గుమ్మంలోకి నెట్టింది.

రాజయ్య వూరుకోలేకపోయాడు. తమయింట రాలిన చెత్తను వూడ్చేసరికే పార్వతి నడ్డి విరిగినంతయింది మరి!

కాని అన్నదమ్ములు నలుగురూ ఏకమయ్యారు.

అసలు నాగరత్నం చెత్తనంతా, రాజయ్య గుమ్మంలోకి నెట్టింది అన్నమాట మరుగున పడిపోయింది.

మాటలమీద మాటలు పెరిగాయి, చేతులు కలవడమే తరువాయి

పూనకం యెత్తినట్లు మొదట శ్రీహరి వొడిసెకర్ర నందుకున్నాడు.

రాజయ్య రోకలిబ డెత్తుకున్నాడు పార్వతి చేటా చీపురు పుచ్చుకుంది. కాని నలుగురు కండలు దిరిగిన దిమిసా దుక్కల్లాంటి మనుషుల ముందు యెంత బలిష్టుడయితే మాత్రం రాజయ్య ఆగగలడా?

ఆవేళ కనకమ్మ వచ్చి, అమాంతం నలుగురి కొడుకుల్ని వారించగలిగింది. "మీ మొహాలు తగలెయ్య! మొదట నన్ను చంపండిరా!" అని రాజయ్యకీ కొడుకులకీ మధ్య పడ్డది

"పేగలు చీలుస్తా!"

"డొక్కలు బద్దలుకొడ్తా!"

"ఒరెళ్ళవోయ్! గాజులు తొడిగించుకున్న రకాలు యిన్నిజూసాం."

కనకమ్మని సరిహద్దు గోడగా, పీఢికుక్కల్లాగ గంటల తరబడి అరిచి అరిచి అలసిపోయాయి యిరుపక్షాలు ఆవేళ అదంతా జ్ఞాపకం వచ్చి

"సరిలే! శాస్త్రం చెప్పినట్లుంది మునగచెట్టుమీద యీగవాలితే, గంయ్ మంటారు కదా ముండలు! దాన్ని నరుకుతానంటావ్ నువ్వు" సన్నని చిరునవ్వు కూడా వచ్చింది పార్వతికి

"చూడు నేనోనాడు అన్నంతపనీ జేస్తా" మీసం దువ్వాడు రాజయ్య.

"పోన్లేగానీ! యొదవసంత కొత్త సినిమా వచ్చిందంటగా పోవాలి" అంది అనునయంగా పార్వతి బియ్యం ఏరడం ముగించి చేట నింట్లోకి తీసికెడుతూ.

"ఏం బాగోలే! జనం పీకెలు నరుక్కుంటున్నారు."

రాజయ్య స్థూలకాయుడేమో, ప్రయాసపడి లేచాడు

"అయితే రెండో ఆట కొద్దంటావ్!" పార్వతి నిలదీసింది

"రేపు పోదాం లెద్దూ"

ఆ విధంగా "మునగచెట్టు పక్కింట" ఆ రోజు చెలరేగవల్సిన తుఫాను చెలరేగలేదు.

## 11

"పాపం! సీహరి యెట్టున్నాడో యేమో! మధ్యాహ్నం పోయి కనుక్కురావల్సింది" భర్త యింట అడుగు పెడుతూ వుండగానే అడిగింది సావిత్రి.

"ఔనే! అన్నయ్యకి చెప్పాలే. అడు పోతాడు.... నాకేళ చిక్కలేనా?" రాములు తల్లి వింటుందేమోనన్న భయంతో మెల్లిగా అన్నాడు

కనకమ్మ అక్కడికొచ్చింది. తల్లికేసి చూడలేకపోయాడు దమ్మబారినట్లు నించున్న భర్త చేతిలోనించి, కమ్చీ, మువ్వలపట్టా అందుకుని రంగమ్మ,

"ఉడుకునీళ్లెట్టనా?" అని అడిగి, "అత్తయ్యా! పొయ్యి కాళీయేగా" నంది కనకమ్మతోటి

"సోంబాబు కనిపించాడ్రా?" కనకమ్మ కోడలి ప్రశ్నకి బదులుగా కొడుకుని ప్రశ్న వేసింది.

"టేసెన్‌కి వెళ్ళాడు గామాలు" నారాయణ తల్లికేసి చూడకుండానే సమాధానం చెప్పేడు

"ఎందుకెళ్ళార్రా మీరు! అయినా మీరెందుకు వెళ్ళాలి? యింకా తల్లిముండని బతికి వున్నానుగా" కనకమ్మ నొచ్చుకుంది. "నేను చచ్చేకా, యీ కొంప కుక్క చింపిన విస్తరాకు అవుతుంది."

నారాయణ తల్లిమాటలు వినపడకుండా దాక్కున్నట్లు పెరట్లో భార్యదగ్గరికి వెళ్ళిపోయాడు.

నాగరత్నం సావిత్రి యిద్దరూ ఒకామె వెల్లుల్లిపాయలొలుస్తూ రెండోఆమె నూరుడు బండమీద పచ్చడి నూరుతూ గుసగుసలు పోతున్నారు.

"ఏం బాబూ! శ్రీహరి వివరం యేమైనా తెలిసిందా!" అన్నది నాగరత్నం

నారాయణ వొళ్ళు మండిపోయింది. పై మీద తుండు ఫట్‌న కొట్టుకుని వెళ్ళిపోయాడు.

పెళ్ళాం అనుసరించింది

"నేనొక్కడ్నే ఏంటి మనిషిని?...అది బాధ్యత నాదా?...అన్నయ్యనో, రామిగాణ్నో పొమ్మని చెప్పరాదూ...అంత ప్రేమ వొలికిపోతూ వుంటే..." విసుక్కున్నాడు.

నాగరత్నం, సావిత్రి యిద్దరూ ఎరుగుదురు, వాళ్ళు వుదయం కనకమ్మ వెళుతున్నప్పుడేగ్రహించారు. అదీగాక, కనకమ్మ నిబ్బరంగా తిరిగి వచ్చింది. మామూలు ఇంటి పనులు చక్కబెట్టుకుపోతూవున్నదీ అంటే శ్రీహరి యే బూదం అడ్డానికో పోయుండాలి తప్ప. జెయిలులో వుండకూడదు.

ఆ యిద్దరు గుసగుసలు పోతున్న సంగతి యింటి విషయం కానే కాదు.

''వూళ్లో కొత్తగా విడుదలైన సినీమా గురించి.''

నాగరత్నం పెళ్ళి కాకమునుపు సినిమాకి బాగా అలవాటు పడిపోయింది. మొదటిరోజు మొదటి ఆట చూసివచ్చి మళ్ళీ మరో సినీమా చూసేవరకూ, దాని కబుర్లే చెప్పుకునేది. సినీమాల గురించి మాట్లాడుతూవుంటే ఆకలిదప్పులు గూడా మరచిపోతుంది నాగరత్నం.

నాగరత్నం వుద్దేశ్యంలో సినీమాలకెళ్ళడం నాగరికత.

సావిత్రి సినీమాల మొహం యెరగనిది గాకపోయినా పల్లెటూరిది.

పెళ్ళయిఅ పట్నం వొచ్చాకా...అదపా దడపా చూస్తున్నదేగాని అదివరకు నెల కోటి అరా చూసేది.

కాని ఆ యిద్దరి తోడికోడళ్ళకి ఆ రోజు బయస్కోపుకి ఎలా వెళ్ళడమో తెలియదు.

శ్రీహరిని కనకమ్మ విడుదలచేయించి వుంటుంది అని వాళ్ల నమ్మకం. కాని ఆ సంగతి భర్తలకి తెలియదు, ఎంతేనా అన్నదమ్ములు.

వుదయం ఆ కుర్రాడ్ని పోలీసులు పట్టుకుపోతే, చీమ కుట్టినట్లయినా లేదే




పిల్లకి అని యిరుగూ, పొరుగూ, అనుకుంటారని భయం. ఆ రోజు సినిమాకి వెళ్లాలీ అంటే మొదట యిరుగు పొరుగులను సుముఖం చేసుకోవాలి

అందుకు పునాదులు మధ్యాహ్నం వేసుకున్నారు

రంగమ్మనికూడా తమ పార్టీలో వేసుకున్నారు కాని, మొగుడు రాపడంతో రంగమ్మ అతనికి వేన్నీళ్లు కాచడాని కెళ్ళిపోయింది.

వీళ్ళిద్దరూ తిరిగి గుసగుసలు పోయేవేళ వెంకట్రవణ వచ్చింది.

వెంకట్రవణకింకా పెళ్ళవలేదు. తండ్రిది పాలవ్యాపారం. అన్నదమ్ములు కూడా తండ్రికి సాయపడతారు.

వెంకట్రవణకి శ్రీహరి వొట్టి జులాయి, పోకిరీ అని సావిత్రీ, రంగమ్మా బెదరగొట్టేరు. ఆ పిల్లకి అదివరకు శ్రీహరిమీద గల సదభిప్రాయం కాస్తా ఎగిరిపోయింది.

అంతలో నాగరత్నం అట్నుంచి దానికి పుటం వేసింది

"ఎంతేనా మా బంగారం, మేం మంచిది కాదంటామే రవణా! యేదో కాలం కర్మం అట్టాగున్నాయి. అతగాడికేం తక్కువ" అన్నది మూతి తిప్పి.

"అయితే నాగరత్నమ్మా! మీ వోడిని జెయిల్లో పెట్టారా?"

"పెట్టకేం చేస్తారు!" అన్నది రంగమ్మ. అని మరికొంచెం యిసింటా జరిగి "అయినా అతగాడికి జైలు సొంత ఇల్లేలే" అంది రహస్యంగా.

"ఎట్టా!" నోరు ఆశ్చర్యంతో వెళ్ళబెట్టింది వెంకట్రవణ.

"అయితే రవణా! యియ్యాల ఆటకి టిక్కెట్లు అందుతయ్ అంటావా?" నాగరత్నం ప్రశ్న వేసింది.

కాస్త తొందరగా యెళితే ఎందుకు దొరకవేంటి ?" రవణ వ్యాఖ్యానించింది.

## 12

రాజయ్య ముష్కరులలాంటి ముగ్గురన్నదమ్ములతో తలపడడం కంటే భార్యని బుజ్జగించడం మేలనుకున్నాడు

రెండో ఆట సినీమాకి బయలుదేర దీసేడు. పార్వతికి పరమానందమయింది. వేధించగా వేధించగా, తిడుతూ, ఒంటరిగా పొమ్మనే మొగుడుకూడా సినీమాకి తీసికెళ్ళడం, అదృష్టంగా తోచింది.

ఇరుగు పొరుగులు చూడాలన్నట్లు రెండు మూడుసార్లు గట్టిగా భర్తని ''టిక్కెట్లందుత వంటావా?'' అనీ, ''ఆనక యీ ఆడనంత నడవలేదని తిట్ట మాకు. కాస్త తొందరగా గుమ్మం దిగు" మని హెచ్చరించింది.

''ఏవుండీ! యీ నల్ల రవికె తొడుక్కోనా ?"—నాగరికత ప్రదర్శించి నప్పుడు భర్తని బహువచనం తప్పకుండా వుపయోగిస్తుంది పార్వతి.

పార్వతి రాజయ్యలతో వెంకట్రవణ సిద్ధమయింది. "మీ అయ్య ఏమంటాడో ?" నంది పార్వతమ్మ.

''ఏవంటాడు ?" కనకమ్మ కోడళ్ళు ముగ్గు రెడతావుంటే వెడతాననిచెప్పా" నంది వెంకట్రవణ.

"మరి ఆ శ్లైరీ?... ఆ ముదనష్టపు జాతితోటే వెళ్ళ" అక్కను కక్కింది పార్వతి.

''మొగుళ్ళు రానీలేదట. అయినా పిస్నీ! నీ తోటి, చిన్నాయినతోటి వెడితే వున్న హాయి ఆ పేచీ జాతితో ఎళితే లేదులెద్దూ," వెంకట్రవణ సరిగ్గా పార్వతికి కావల్సిన మాటలాడింది.

కనకమ్మ యిల్లు చక్కబాటు ముగించుకుని, కుండలో అన్నం వున్నదీ లేందీ రెండు మూడుసార్లు చూసింది. వూరగాయ; మిగిలిన పప్పుచారు; కుక్కో, పిల్లో తోసెయ్యకుండా జాగ్రత్త పెట్టింది.

ఏదో రాత్రివేళ శ్రీహరి వస్తాడని ఆమె వుద్దేశం.

*　　　*　　　*

నారాయణ పక్కమీద అటూ యిటూ దొర్లి "ఏందో వొంట్లో యియాళ నీర్సంగా వుందే" అన్నాడు భార్యతో.

కాళ్ళు రుద్దుతున్న రంగి ''వెంటనే ఈ పాడు కొంపలో కూడు సరిగ్గా కుద

రదం లేదు లెద్దూ...అందులోకి మెత్తనోళ్ళని చూస్తే మొత్త బుద్ధని నీ కాడి కొచ్చేసరికి పచ్చడి మెతుకులే అవుతున్నాయి మరి" అని బాధపడింది.

"కూడు మాటకేంగాని యీా మధ్య మాంసం బొత్తిగా తక్కువ దెస్తందా యేంటి అమ్మ?" నారాయణ అడిగాడు

''అమ్మా.. అమ్మా.. అమ్మ. ఆమె నీకోసరం కూరెట్టా వుంచుతాది? శ్రీహరి ముద్దులకొడుకున్నాడుగా. అతగాడికి తిన్నంత తిననని, పారేసినంత పారేయమని ఎదానకొడతాది."

నారాయణ జవాబివ్వకపోవడంతో రంగమ్మ ఆవేశం మరింత ఎక్కువైంది.

"మన రెక్కల కట్టం మనం తింటూకూడా ఎందుకొచ్చిందీ బానిసరెక్కం? యేరే వుడకపెడతానంటే యినవు."

రంగి భర్తకాళ్ళమీద విస్ఫోటం ప్రదర్శించి అవతలికి జరిగింది.

అదే విషయమైన సంభాషణ తతిమ్మా రెండు జంటల మధ్య జరిగింది.

సోములు భార్య నాగరత్నం కంట తడికూడా బెట్టుకుంది.

"ఏరే పోకపోతే, నా కాన్పు కలిగే ఏళకి ఎండి చస్తా" నని వాపోయింది. నాతో యీాను, కడతారు తోడికోడళ్ళు — ఇక సరే సరి...అత్తయ్య శ్రీహరో అంటుంది ఎంతసేపూ మరో ధ్యాస లేదు" తమ తమ మొగుళ్ళతో ఇట్లాంటి పేచీలే పెడుతున్న తోడికోడళ్ళమీద, అత్తగారిమీద మెటికలు విరుచుకుంది నాగరత్నం

సోములుకి కష్టమనిపించింది. నిజమే కడుపుతోవున్నది అంటే యెంత జాగ్రత్తగా చూసుకోవాలి?తోడికోడళ్ళకి లేకపోతే అమ్మకయిన వుండొద్దా? సంపాయించేది మేమూను, తినిపోయేది నలుగురూను తనకి పోతే యె తల్లి అనో, అన్నదమ్ములనో వూరుకుంటాడు. పరాయి యింటిబిడ్డ దీన్నెందుకు బాధలు పెట్టాలి అనుకున్నాడు.

వొళ్ళు మండిపోయింది.

' చూస్తా... చూస్తా .చిర్రెత్తిందంటే వేరయి మరీ చూపిస్తా" అన్నాడు భార్య కేసి తిరిగి

## 13

తెల్లారేసరికి శ్రీహరి కనిపించాడు. మొదట రంగమ్మ, ఆనక నాగరత్నం పిదప సావిత్రి చూశారు.

"రాతిరి తెల్లార్లూ మీ అన్నయ్య నిద్దురోలేదంటే నమ్ము" సావిత్రి చెప్పింది.

''రాత్రికాడ ఏమెరతావ్‌లే పెందలకడవో అని నేననకపోతే ఆయన అప్పుడే ప్రయాణమయ్యా" డంది నాగరత్నం.

"నాకు తెల్సు శ్రీహరీ నిజంగా ఆ శ్రీహరే ఏదో విధాన రాకపోతాడా?" శ్రీహరి ప్రయోజకత్వాన్ని కొనియాడింది.

శ్రీహరికి వొళ్లు మండింది

"ముసల్దాని మొహం జూసిగాని లేకపోతేనా'' అని పళ్లు బిగించి గొణుక్కున్నాడు

తర్వాత ముగ్గురన్నదమ్ములూ లేచారు

శ్రీహరిని చూసి సంతోషించారు ఎంతేనా పేగు సంబంధం. అదీగాక ఆ రోజుకూడా శ్రీహరి యింటికి రాకపోతే యేంచేయాలన్నది సమస్యకదా! మొహ మొహాలు చూసుకుని చివరికి సోములు పలకరించాడు.

"ఏవ(యిందిరా? కేసు కొట్టేసినారా?"

"అమ్మ వచ్చి విడిపించిందిలే" శ్రీహరి అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయాడు.

అన్నదమ్ములందరూ పనిలోకి పోయాక "అమ్మా! వుడుకునీళ్లెట్టవే" అన్నాడు శ్రీహరి.

"అయ్యని పోలీసులు చితగ్గొట్టేరుకాబోలు" అంది నాగరత్నం వేళాకోళాని కన్నట్లు.

"అప్పుడు నీకు కడుపు నిండుతుందే?" మండిపడ్డాడు.

"నాకడుపు నిండడానికేం? నా మొగుడేం దాతకానోడా? నా దమ్మిడీ ఓ పనికిమాలినోడు తినాలికాని'' విరుచుకుపడింది నాగరత్నం.

''వదినని వూరుకున్నానుకాని మరోడు అంటేనా.''

స్నానం చేస్తూనే రోషం ప్రకటించాడు శ్రీహరి.


"మీదపడి పేగులు చీలుస్తావా?" రంగమ్మ మాట అందించింది.

"అంతే మరి!" చెంబు కుండలో పడేశాడు శ్రీహరి.

"ఓరి నీ జిమ్మడిపోను! నా పేగులు చీలుస్తావా?'' నాగరత్నం అంగ విన్యాసం చేసింది. శ్రీహరికి వొంటిని నిప్పులు చెరిగినట్లయింది.

అంతలో కనకమ్మ వచ్చి "ఓరి వెధవా! పెద్దా చిన్నా వొద్దురా?...పో అవతలికి" అని కసిరింది. కోడళ్లకేసి తిరిగి ''ఏదోనమ్మా పనికిమాలినోడే! తండ్రిలేని బిడ్డ'' అని వాళ్ల కోపాగ్ని చల్లార్చ జూసింది.

శ్రీహరికి తల్లిమొహం దూసేసరికి నోరు పెగిలిందికాదు.




గిన్నెలో కూడు తోడి, ఆమె శ్రీహరి ముందు వుంచి ఎదురుగా కూచుంది. ఆమె కంటివెంట నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

శ్రీహరికి ముద్ద దిగలేదు. తల్లి తన గురించి యేడవడం మొదటిసారి కాకపోయినా, తనలోని చాతకానితనం ఆమెను కష్టపెడుతున్నదని అతగాడు గ్రహించాడు.

నిజమే తను పనికిమాలినవాడే! లేకపోతే "ఆడకూతుళ్లు దుంప తెగ! ఆడిపోసుకుంటారా?" కసిగా గొణిగాడు.

"విచారించకమ్మా! చూస్తూవుండు. నేను రాజా వుజ్జోగం చేస్తా" నని అవతలికి పోయాడు.

నిట్టూర్చింది కనకమ్మ.

## 14

శ్రీహరి వుద్యోగాన్వేషణలో పడ్డాడు. రోడ్డుమీద కనిపించిన బోర్డులు చదివాడు, తనకెంతవరకు అక్షరం ముక్కలు జ్ఞాపకం వున్నాయోనని తెలుసుకుందికి. ఏ బీ సీ డీ లు పూర్తిగా మర్చిపోయాడు. సినిమా బోర్డులన్నీ క్షుణ్ణంగా చదవగలిగాడు.

హూటా హుటీ ఓ సినిమా హాలుకి వెళ్ళాడు. "నేను మానేజర్ని చూడా" లన్నాడు అక్కడి వాచ్‌మాన్‌తోటి.

"ఎందుకూ?" వాచ్‌మన్ ప్రశ్న.

"పనుంది. తిరిగొచ్చి చెబుతాగా."

"అదో, అదే; ఆ సూటాయనే మానేజరు..." వాచ్‌మన్ చెప్పాడు.

"అయితే యిదివరకెక్కడ పనిజేశావ్?" మానేజర్ మరకుర్చీలో విలాసంగా తిరుగుతూ ప్రశ్న వేశాడు.

"చెయ్యలేదండీ! గేట్‌కీపర్ పనిచెయ్యడం తెలుసండీ!" శ్రీహరి వినయం ప్రదర్శించాడు.

"ఎలా చెయ్యాలో ఎలా తెల్సు...?"

శ్రీహరి బుర్రగోక్కున్నాడు.

"తెలుస"న్నాడు చివరికి గొంతు తడిచేసుకుని— "ఉహూం. నీ కనుభవం లేదు..." పొమ్మన్నాడు మానేజరు

"మీ దగ్గిర వుద్యోగంలేదని చెప్పరాదూ' శ్రీహరి విసుక్కున్నాడు.

మానేజరు కాలింగ్‌బెల్ నొక్కాడు.

శ్రీహరి దానిసంగతి గ్రహించి విసవిసా వెళ్ళిపోయాడు.

ఆ మానేజర్ను తనకి తెలిసినన్ని తిట్లు తిట్టేడు యివతలికొచ్చి.

అంతేకాదు వాడికి గేట్‌కీపరు వుద్యోగంమీద మోజు ఎక్కువయింది.

మరో సినిమాహాలుకి సరాసరి వెళ్ళాడు ఆ హాలు దగ్గర వాచ్‌మాన్ లేడు. గేటుకి తాటికాయంత కప్పమాత్రం వుంది

వాల్‌పోస్టర్‌లు చూస్తూ, హాలుచుట్టూ మామూలు ధోరణిలో ప్రదక్షిణలు చేశాడు. హాలుకి పదిగజాల దూరంలో చిన్న తడికెల హోటల్‌ముందు క్యారం సాడుతున్నారు. మ్యాట్నీ కింకా గంటన్నర టయిముంది.

శ్రీహరికి సినిమాహాలు సంగతి మరి జ్ఞాపకంలేదు. ఎలికమీదికి దూకబోయే పిల్లిలా వాడి మనస్సు క్యారం సాటమీదకి దుముకింది.

తన పేటయితే బాగుండును అనుకున్నాడు

వెళ్ళి, పొంచి ఆట గమనించసాగాడు ఆటగాళ్ళలో ఒకడు మంచి ప్రావీణ్యత కనబరుస్తున్నాడు. రెండోవాడు పిక్కల్ని పాకెట్లో వేయడంకంటే, స్ట్రైగర్‌ను యెక్కువసార్లు వేస్తున్నాడు.

శ్రీహరి వాడికేసి జాలిగా చూశాడు. "ఎర్రి ఎదవ" అన్నట్లు పెదవులు కలిపాడు. ఆటగాడికి శ్రీహరి చూపులు వొంటిని చీమలు ప్రాకినట్లున్నాయి.

"మొనగాడిలా చూస్తున్నావే?..." అన్నాడు.

"నువు కాయిగురూ!... నీ వంతు నేనాడతా" అన్నాడు శ్రీహరి.

"ఓయబ్బో! వస్తాద్ రౌడీవా?"

"బోర్డుమీద చెడుగుడి ఆడేస్తా" శ్రీహరి తల ఎగరేశాడు మళ్ళీ క్రాపింగ్ నుదుటిమీద సర్దుకున్నాడు.

ప్రావీణ్యుడు శ్రీహరిని వస్తాదు పిల్లికూనని చూసినట్లు చూశాడు.

"ఏవూరు మంది ?" అన్నాడు

రెండోవాడు యీలోగా ఆలోచించి వెంటనే నిలబడి "సంయ్ ! యింద ఆడు రూపాయికాయ్ ! డబుల్సు ఆడ్దామా ? సింగిల్సా ?" అన్నాడు. తనూ ఆడదామన్న కుతూహలం చంపుకోలేదు

"నువ్వెందుకు గురూ ? నేనాడ్తాగా సింగల్స్ వేయి ఉన్నాడు శ్రీహరి"

బోర్డు పేర్చేరు పావలా పందెం కాశాడు శ్రీహరి

మొదట ప్రవీణుడు స్ట్రయిక్ చేసి మూడుపిక్కలు వేశాడు. తుపాకి గుళ్ళ ల్లాగ దూరిపోయా యవి !

శ్రీహరి ఎటో చూస్తున్నట్లు నటించాడు ప్రవీణుడు విజయగర్వంతో గురి తప్పాడు.

శ్రీహరి మొదట అత్యంత ప్రయాస ప్రదర్శించి ఓ పిక్క వేశాడు ప్రవీణుడి బృందం 'భేష్' అంది వెటకారంగా. కాని శ్రీహరి యీసారి పిక్క కేసీ గురి చూడలేదే.

రిమ్ముకి "రిఫ్లక్షన్ షాట్" కొట్టాడు. 'కార్నర్'లో వున్న రెండు పిక్కలు 'బుడుంగున' పాకెట్లో పడ్డాయి. "రెడ్" వాటి ననుసరించింది. అటు తర్వాత వరసే. చివరికి బోర్డుమీద తెల్లపిక్కలు మాత్రం తెల్లమొహం వేసుకుని వుండి పోయాయి. ఛాన్సురాలేదు ప్రతికక్షికి

ఆ విధంగా శ్రీహరి ఆటగెల్చి ఆడినందుకు పావలా తీసుకొని, పావలా బాకీ తీర్చేశాడు. శ్రీహరి కీ అవకాశం యిచ్చినవాడి పేరు రతన్

రతన్కి గేట్ మేన్ వుద్యోగమే. అంటే వాల్‌పోస్టర్లంటించడం దగ్గిర్నించి వచ్చిన ప్రమోషన్ అది.

శ్రీహరి, రతన్ కలిసి టీ తాగారు. కొత్తగా విడుదలయిన సినీమాస్టీద అందులో హీరోయిను మేకప్‌మీద యిద్దరికీ ఏకాభిప్రాయం కుదిరింది అది వాళ్ళ పరిచయాన్ని గాఢమైత్రిగా మార్చేసింది.

రతన్ పరిచయంతో శ్రీహరికి గేట్‌మాన్ వుద్యోగం వచ్చినట్టే వుంది.

కానీ రతన్ మరి వారంరోజులుపోతేగాని రికమండ్ చేయలేనన్నాడు.

అయితే సినిమా మాత్రం వుచితంగా చూడమన్నాడు. శ్రీహరి నిజంగా రతన్ లాంటివాడు దొరకడం తన అదృష్టం అనుకున్నాడు.

తనకున్న మిత్రబృందం అంతా తనవద్ద చిల్లరుంటే చేరుతారే తప్ప, లేనప్పుడు సిగరెట్ దాకా ఏమిటి? బీడిముక్కైనా యివ్వరు.

## 15

మహాపట్నమయితే అక్కడున్న మనిషి తన కాళ్ళమీద నిలవలేడు. పూర్తిగా అతగాను యింకొకడిమీద ఆధారపడాల్సిందే. ఒకోనాడు రిక్షావాళ్ళంతా కూడ బలుక్కున్నట్లు పది పైసలు యెక్కువ చెప్పారంటే, రిక్షా గత్రపాణివల్లె అన వల్సిందే. కాఫీ గత ప్రాణులు పంచదార కరువొస్తే బెల్లం కాఫీ ఐనాసరే, పంచ దారదని చెబితేచాలు అయిదు పైసలు ఎక్కువ యిచ్చి తాగుతారు. అలాగే పోస్టుమాన్ కోసరం ఎదురుచూసే వాళ్ళుంటారు. వీళ్ళకి ఉదయం లేచింతర్వాత పోస్టుమాన్ తన కళ్ళపడి 'మీకేమీ లే' వని చెప్పేదాకా, కళ్ళు తీపులు పుట్టేట్లు ఎదురుచూస్తూ వుంటారు.

అయితే మునగచెట్టు యింట్లో ఎవరూ పోస్టుమాన్ కోసరం తలుచుకోరు. కొండలు అంటే, కనకమ్మ కూతురు. అత్తవారి ఊరు దుర్గాపురంనించి సాధా రణంగా కబురు రావడమో, యెవరేనా ఆ దారంట పోయేవాళ్ళుంటే క్షేమ సమాచారాలు తెలియడమో తప్ప ఉత్తరాలు రావు.

"మా యింటికా? వుత్తరాలేదనించి బాబు?...కోడలి పిల్లలి కేమేనా వచ్చాయా?" అన్నది కనకమ్మ తపాలా జవానుతో.

"మునగచెట్టు వున్నయిల్లు, తూకం కనకమ్మ, జగదంవీధి, సత్యంపేట అంటే నువ్వేగదా! యింది యిది నీ కార్డు..." అని పోస్టుమాన్ ఒక కార్డు యిచ్చి వెళ్లిపోయాడు.

కనకమ్మ అనవసరంగా బెంగపడిపోయింది. వుత్తరం అటూ యిటూ తిప్పింది.

వెంకట్రవణ వయ్యారంగా బిందె పుచ్చుకుని...అటు వెడుతున్నది. "ఒసేవ్! రవణమ్మా! యిది కాస్త చదివిపెట్టు" అంది.

చేపలు కడుగుతున్న పెద్దకోడలు, బట్టలకి సబ్బు పెడుతున్న రెండో కోడలు, గోరుచిక్కుడుకాయ లేరుతున్న మూడో కోడలు భయాందోళనలు ప్రకటిస్తూ వచ్చారు.

"కొండలు తల్లి రాయించిందేమో!" అన్నది కనకమ్మ.

వెంకట్రవణ హయ్యర్ ఎలిమెంటరీ బళ్ళో చదివింది. వుత్తరం చదవ నుంకించి "ధూత్ ! ఎదవ రాత... గొలుసులే, అచ్చరాల్లేవు" అని విసుక్కుంది.

"శ్రీరస్తు, శుభమస్తు తూనం కనకమ్మ అమ్మకి నీ కూతురు పాలెం కొండలు రాయించేదేమంటే..." అని చదివేసరికి ఆందోళనపడి "అయ్యో తల్లీ ! నీకేం ఆపదొచ్చిందే !" అని అడ్డుతగిలింది. దాంతో తిరిగి వెంకట్రవణ మరింత నుదుట ముడతలు పెట్టి, కూడబలుక్కోటంలో పడిపోయింది.

..."మీ యల్లుడుగారు పోయిన నెలదినములుగా సుస్తీపడున్నారు..." అది విని గుండెలు బాదుకుంది కనకమ్మ. "ఓలమ్మో !" అంది.

"అందరూ చాతబడి అంటున్నారు. నీవు రావడంగాని, శ్రీహరిని పంపడం గాని చేయగలవు" ముగించి అలిసిపోయింది వెంకట్రవణ.

కనకమ్మకి వెంటనే ఏమీ పాలుపోలేదు. కూచుని రాగాలు మొదలెట్టింది.

"పాపం ! కొండలమ్మ ఎన్నడూ ఏ పాపమూ చేసి యెరగంది. ఏ దేవుడు దాని వుసురోసుకుంటున్నాడో" అని సానుభూతి చెప్పింది సావిత్రి.

"ఎదవ సచ్చినోళ్ళు ! పొలాల గట్లంట తగూలు ఏస్తేచాలు, చేతబడు లంటారు..." మెటికలు విరిచింది రంగమ్మ.

"అదేం టత్తయ్యా ! అట్లా అధైర్యపడితే యెట్టా ?... శ్రీహరిబాబు నంపించండి" అన్నది నాగరత్నం.

"ఏమోనే తల్లీ ! యీ కష్టాలన్నీ నేనోపలేనే. భగవంతుడు నన్నైనా పట్టుకు పోడు" అని తలబాదుకుంది కనకమ్మ.

వెంకట్రవణ చెప్పగా తెలిసిన యిరుగూ పొరుగూ వచ్చారు. కనకమ్మని వోదార్చారు. అంతలో "అమ్మోయ్" అని కేకలేస్తూ శ్రీహరివచ్చి యింటి ముంగిట దృశ్యాన్ని చూసి నివ్వెరపోయి వూరుకున్నాడు.

"అమ్మోయ్ ! యివాళ నాలుగు రూపాయలు సంపాయించా" నన్నాడు.

"ఏం చెప్పేది శ్రీహరీ ! మీ బావయ్యకి చేతబడి చేసేరంట, నీ చెల్లెలు బ్రతుకు తెల్లారిందిరా" అంటూ దుఃఖపడింది కనకమ్మ.

శ్రీహరి మొహం వేలాడేశాడు. భోజనాల వేళయ్యేసరికి భర్తలు ఆవురావున వస్తారు గనక కోడళ్ళు పనులమీదకి వెళ్ళిపోయేరు.

## 16

"అమ్మా ! యింకా బిజినెస్ పెట్టి రెండు రోజులేనా అవలేదే. నువ్వే యెళ్ళ రాదుటే" అన్నాడు శ్రీహరి.

"బిజినెస్ ఏంటిరా ? అసలు ఏ పోలీసు వాళ్లూ మళ్ళీ పట్టుకుపోయే బిజినెస్ కాదుగదా" అన్నది కనకమ్మ.

శ్రీహరి "అమ్మతోడు ! కాదు" అన్నాడు తన నెత్తిన చెయ్యి పెట్టుకుని.

"ఇకమీదట పోలీసులు మన ఫ్రెండ్సే" అన్నాడు గర్వంగా నవ్వి.

"అంటే ఏంటిరా ?"

"అంటే నేస్తాలు"

"అయితే నువ్వు పోనంటావు?" నిలవేసింది కనకమ్మ.

"మా అమ్మవుగదూ ! నువ్వెళ్ళవూ ? యింద యీ అయిదు రూపాయలు" శ్రీహరి తల్లికి తన చేతి మడత విప్పి ఐదురూపాయల కాగిత మొకటి తీసి యిచ్చాడు.

ఆమె కొడుకు ప్రయోజకత్వానికి సంతోషించేదే గాని, వాడిమీద ఆమెకి పూర్తి విశ్వాసం లేదు.

నిజంగా ఐదురూపాయిల నోటేనా అని పదే పదే పరికించి చూసింది

"నాకు నీ వుజ్జోగం యేంటో చెప్పరా ?" అంది చివరికి.

"ధూత్ ! బిజినెస్ ! అది నీకు తెలవదుగాని, పోయి మూటగట్టుకో బస్సెక్కెయ్యి, చెల్లికాడ కెళ్ళవుగాని" అంటూ శ్రీహరి తొందరపెట్టాడు. రాములొక రెండూ, సోములొక నాలుగూ, నారాయిణ మూడు రూపాయలిచ్చాడు.

"తల్లీ! కోడలు పిల్లలూ ! సిహరి పనికిమాలినోడు నోటి దురుసోడు మీరే అడిని కడుపులో పెట్టుకోవాలి" అని జాలికోసరం అర్థించి, కనకమ్మ ప్రయాణమయింది.

శ్రీహరి ఆమె వెంట బస్టాండ్‌కి నడిచాడు.

గుమ్మం దిగుతూవుండగా వెంకట్రవణ ఎదురొచ్చింది

"వొసేవ్ ! రవణా ! కొండలకాడికి పోతున్నా. యీ దొట్టిపనికిమాలినోడు. ఏదో ఆస్యానికన్నా పట్టించుకోబాక" అని మరోసారి శ్రీహరిని అప్పజెప్పింది కనకమ్మ.

శ్రీహరిమీద జవాబుగా మెటికలు విరుచుకుంది వెంకట్రవణ.

"ఓసోస్ ! మీ అన్నయ్యేనేటి పహిల్మాను ! నేనూ చేస్తా కసరత్తు హై ! బస్తీమీద సవాల్ !" అన్నాడు శ్రీహరి

"ఓరోరి పదరా ! మేకపోతూ" అన్నది కనకమ్మ

తల్లిని బస్సెక్కించి హుషారుగా చెయ్యూపి "వెళ్లిరావే!" అన్నాడు శ్రీహరి.

"ఒరే బాబూ! బుద్ధిగా మసలుకోరా! అడ్డమైన వాళ్ళచేత మాటలు పడ మాకు" అంటూ కదిలిపోయే బస్సులోనించి అరుస్తూనేవుంది కనకమ్మ.

శ్రీహరి తిన్నగా రైల్వేస్టేషనురోడ్డు చేరుకున్నాడు. అక్కడ యితగాడి జత గాడు కాచుక్కూచున్నాడు.

అక్కడ గుడ్డపరిచి మూడుముక్కలాట మొదలెట్టారు.

ఇటువంటివాటిని ఆ వూరిలోవుండే జనం విద్యావంతులే అయినా, విద్యా విహీనులే అయినా అసలు గమనించనట్లే వెళిపోతారు. పల్లెటూరునించి దిగబడే జనం నలుగురు మూగగానే శ్రీహరి జతగాడు ఒకడు పది పైసలు పావలా కొట్టేశాడు. అక్కడ చేరిన అమాయకులు తమ కళ్ళముందరే ఒక వ్యక్తి యిలా లాభం కొట్టేయడం వింతపడి చూసి, తామూ సిద్ధమయ్యారు.

ఆ విధంగా గంట రెండు గంటల్లో నాలుగు రూపాయలు పోగవడం - పోలీసువాటా పోను, తలో రూపాయి మిగిలింది. శ్రీహరి "యింటికిపోతా" అన్నాడు. కాని రెండడుగులు వేసి "ఛస్! యింటికాడ వొదినెలున్నారు. ఆళ్ళకీ మనకీ చుక్కెదురు. పద! సినిమాకు పోదాం" అన్నాడు.

''చలో!'' అన్నారు తతిమ్మా 'ఫ్రెండ్స్.'

ఆ ముగ్గురూ కాకాహోటల్లో దూరారు. కాకా తదూ బజ్జీ యిచ్చాడు.

"కాకా! యివాళ ''రంభ పెళ్ళి'' మొదటిరోజు. టీ స్ట్రాంగ్, మలాయ్ యేసి పట్రా!'' అన్నాడు శ్రీహరి.

ఆ చీకటి కారే గోడలమధ్య మకిరిరాతి బల్లమీద టీ రంగుతో కలిసిపోయే కావిరంగు గళాసులతో టీ తెచ్చి 'కాకా' యివ్వగా, ఆ ముగ్గురూ అమృతంలా చప్పరిస్తూ, మధ్య మధ్య కిటికీలోనించి చూస్తో "గురో టికెట్లు దొరుకు తయ్యా? లేకపోతే చొక్కా యిప్పుకోవాల్సిందేనా?" అని మాటాడు కుంటున్నారు.

టీ చప్పరిస్తున్న శ్రీహరి అంతలో వులిక్కిపడ్డాడు. ఎరచూసిన గద్దలాగ బయటికి నడిచాడు

"వెంకట్రవణా!" అన్నాడు. వెంకట్రవణ సినిమా కెళుతున్నది. పక్కనే మరో పది పన్నెండేళ్ళ పిల్ల వున్నది.

వెంకట్రవణ పట్టు పరికిణీమీద నైలాన్ వోణీ వేసుకున్నది జడ వదులుగా వేసుకుని చివర రిబ్బను పెట్టుకోకుండా వదిలేసింది. చిన్ని బొట్టు. దానిమీదకి కూడా కాస్తంత రాలి తెల్లతెల్లగా మెరిసేట్లు పౌడ రద్దుకుంది. అయినా ఆ పిల్ల మొహంలో అడవిపువ్వు నాజూకులాంటి మొరటుతనం తొంగి చూస్తున్నది. యవ్వనమప్పుడే నిండుగా, ఆమె నున్నని బుగ్గలలోనించీ, రొమ్ములలోనించీ తొంగిచూస్తున్నది.

శ్రీహరి మొదటి పిలుపు ఆ పిల్ల పసిగట్టలేదు. రెండో పిలుపుకి చుర చుర చూసింది. మూడో పిలుపుకి నించుండిపోయి, ఏదో అనబోయి నవ్వేసి "సచ్చి నోడా !" అంది.

"ఇష్షు" దగ్గరగా వచ్చి శ్రీహరి చెప్పాడు. అందరి ముందు నా పరువు తియ్యకు. మా మంచి దానివంటాను" అతగాడి స్నేహితులు అచ్చం సినిమా హీరో హీరోయినులను చూస్తున్నట్లు వాళ్ళకేసి చూస్తున్నారు.

వెంకట్రవణ పూర్తిగా మారిపోయింది. అందమైన మెలికలు తిరిగిపోయింది. ఆమె అంగసౌష్ఠవం, శ్రీహరిని మంత్రముగ్ధుణ్ణి చేసింది.

కార్లు, లారీలు, జనం సైకిల్ రిక్షాలు, ముఖ్యంగా ముష్టివాళ్ళుకూడా కొన్ని క్షణాలు ఆ యిద్దర్నీ మేల్కొల్పి, యీ బాహ్య ప్రపంచంలో పడేయ లేకపోయాయి.

వులిక్కిపడ్డట్టు శ్రీహరి "సినిమాకన్నావుగా దిగబెడతా పద" అన్నాడు. "ఎందుకులే ? మేం పోగలం" అన్నది. కాని శ్రీహరి తనను వదిలి పోతాడే మోనన్న బిడియం ఆ పిల్ల కనులలోనించి తొంగి చూస్తున్నది.

శ్రీహరి కాలరెత్తుకున్నాడు. వెంకట్రవణ పక్కన నడుస్తూవుంటే, తనకి సూటూ బూటూ, అఖరికి బోలెడు విద్యా, అన్నీ వున్నట్లు ఆనందం కలుగు తూంది. చూసేవాళ్ళ కయితే అవేమీ అగుపించలేదుగాని, అల్లావుద్దీన్ అద్భుత దీపంలో, దీపభూతం మాయతో అల్లావుద్దీన్ క్షణంలో మారినట్లు మారిపోయింది శ్రీహరి మనస్సు.

"మీవోళ్ళు నిన్నివాళ వొంటరిగా పోనిచ్చారేం ?" అడిగాడు.

"లేదు. తోవలో నువుంటావని చెప్పాను" అంది రవణ కనుబొమ లబోలాగ తిప్పి.

శ్రీహరికి తెలుసు అది వేళాకోళమని. ఐనా నమ్మేశాడు.



## 17

అత్తగారు వెళ్ళిపోయిన తర్వాత కోడళ్ళకి ముగ్గురికీ యేదో సంబరమంత సంతోషముంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించినట్లుంది. ఇల్లంతా విశాలమై పోయినట్లుంది. ముగ్గురూ కలిసి, కనీసం మునగచెట్టు చెత్త పురించేనా తలుచుకోకుండా కబుర్లు చెప్పుకున్నారు.

సోములు, రాములు, నారాయణలు కూడా తమ భార్యల అన్యోన్యతకి ఆశ్చర్యపడ్డారు. నారాయణ అన్నాడు "అమ్మ వెళ్ళిందేకాని నాకేదోలాగుంది."
"ఔను ! ఒకేళ దేవుడు చల్లగా చూడకపోతే అనుకోకూడదు గాని—"అంటూ మాట అందించింది భార్య.

"ఛీ ! ఎదవ నోరు. కొంతలు వొట్టి గాబరామనిషి. అంతేగాని, అడికేటే ; మా బావ దుండుముక్కలాంటివోడు" అంటూ భర్త అడ్డురాగా ఆమె ఆక్రందించి లేచిపోయింది.

వుదయం కనకమ్మ లేకపోవడంతో ఐద్ధకంగా కూసేకోడికన్నా ఐద్ధకంగా లేచేరు ముగ్గురు కోడళ్లూ. ఆ రాత్రి శ్రీహరి రానేలేదు.

రాములు కసిదీరా ''అది పోయిందంటే పీళ్లకు మొగుడు ముండాకొడుకులు కూడా సచ్చారనిపించిందిగావోలు ! లెగిసి చావరేం ?" అని చుట్ట కొరికి విసుక్కుని తుపుక్కున వూస్తేగాని కోడళ్లు లేవలేదు.

ముగ్గురూ ఆవలిస్తూనే ఆవలింతలు, బద్దకమూ దాచుకుంటూనే భర్తలను పనులమీదికి పంపారు.

మునగచెట్టు కనకమ్మ లేనందుకు తెల్లవార్లూ యేడ్చిందా అన్నట్లు మరింత ఆకు రాల్చింది

పార్వతి తిట్టకోడం. నిత్యమూ వున్నదే. రాజయ్య చుట్ట చుట్టుకుంటూ వినడమూ రోజూ వున్నదే. అయినా ఆవేళ మాత్రం పార్వతి భర్తతో మాట్లాడుతూ చెత్తవూడ్చుకోడం సాగించింది. పొరుగింట ముగ్గురు కోడళ్లను వదిలేసి ఒక అత్తగారు వెళ్ళిపోడం ఏ ఆడదాన్ని ఆకర్షించదు గనక ?

"ఇక చూడండి యీ ముండల సంబడం ... యీ సొత్తులన్నీ ఆ ముసల్ది బతికి వున్నంతవరకే. ఆనక ఎవరి తుంబా దుడ్డు వాడిది అవకపోతేగదా''ని చేతులు తిప్పింది పార్వతి.

''ఇస్సు ! గోడకాడే వుండి వినగలరు పోనీలేద్దూ ! మనకెందుకూ ?'' అన్నాడు రాజయ్య వారించి

"ఏమోలే ! ఎవరెలాపోతే నాకేం ? యీ మునగచెట్టు గోలమాత్రం నన్ను కట్టి కుడుపుతున్నది. ఈ ముదనష్టపుపీడ నాకు విరగడచేయించు చాలు !'' పార్వతి చీపురు భర్తమొహంమీదికి ముమ్మారు చూపెట్టింది. అంతే దాంతో కొట్టా సుమాని గాడుగాని అంగ విన్యాసంలో అది రాజయ్యను తాకుతా నన్నట్లు నృత్యం చేసింది.

రాజయ్యకూ్కడా భార్య అవస్థమీద జాలివేసింది. "వుండెహే ! మంచిరోజు చూసి దీన్ని ఓ రాత్రికాడ నరికేస్తా" అన్నాడు.

"ఓయబ్బ ! ముఖం చూడరా అయ్యది ! నరికేస్తాడట నరుకుడు'' పార్వతి వెటకారంచేస్తూ మళ్ళీ భర్తని జూసి నవ్వేసింది.

''నూస్తావుండు !'' అంటూ రాజయ్య మిగిలిన పొగాకును రొండిన పెట్టుకుని బయటికి నడిచాడు.

నాగరత్నం పెద్దకోడలు గనక అత్తగారటు బయటికి పోగానే తనదే గనక ఆజ్ఞాయిషీ మునగాకు పూడ్చిపొయ్యడం నామోషీ అనుకుంది. పైగా సావిత్రిని పిలిచి "అమ్మాయ్ ! మనకున్న పని తినకున్నా తప్పదన్నారు. అత్తయ్యెళ్లిం దని, తలమీద పనులేద కెళ్లినయ్ ? కాస్త యీ చెత్త పూడ్చేతల్లీ ! నేను పొయ్యిమీద వొడ్లాని కెసరుపడేస్తా" అంది.

సావిత్రి మూతి యిలా తిప్పింది. కనుచాటు జేసి తోడికోడలుమీద "దీని అధికారం మండిరి" అని మెటికలు విరుచుకుంది.

రంగమ్మ యిదే అద నన్నట్లు గుమ్మంలో చతికిలబడి చేపలు పిల్చి బేరం సాగించింది.

"అక్కోయ్ ! నాకాడ డబ్బులెట్టి నేను మూడు చేపలు కొంటున్నా. మరి మీలో యెవరెవరికి గావాలో చూసుకొండి" అని కేకేసింది.

దాంతో నాగరత్నం మండిపోయింది. దాని మొగుడికీ దానికీ నన్నమాట. మరి తతిమ్మా అందరికీ ? ఛీ ! తనకీ వున్నాడు మొగుడు ... మరిది డబ్బు లివ్వబట్టిగదా ! రంగమ్మ అంత బెరుసుగా చేపలు కొని కేకేసింది ?

"మీ బావ యిచ్చిన రూకలేం యిక్కడ కుప్ప పోసుకు కూచోలేదే తల్లీ ! నీ కాడుంటే మరి నాలుగు కొను. లేవా పప్పుచారే చాల్లే !" అంది అక్కసుగా.

సావిత్రి నాగరత్నంతో అన్నది "అయితే, మన కియాళనించీ కూరా నారా అంతా యేరే ఎవ్వారమా ?"

"అట్లాగే వుంది చూస్తూవుంటే" అంది బియ్యం కొలుస్తూ.

"అది పాయె ! సుఖపడతాం. ఎవరికుండాళ్ల కుంటేగాని. యీ పూట కూర నేను కొంటాగాని, బావ రాగానే డబ్బు లిచ్చేమాటయితే నే చేపలు కొంటా" అంది రంగమ్మ.

'అట్టాగేలే ! లేపోతే మీ ఆయ నార్జనేం బళ్లతో, పారుద్దా ఇక్కడ ?" అన్నది సావిత్రి

"పోన్లేమ్మా ! మీ అయనేసరి లక్షాధికారి" ఎక్కసక్కమే అయినా దులి పేసింది సావిత్రిని రంగమ్మ.

ఆ పూట ముగ్గురు కొడుకులూ వచ్చేసరికి వంట అవలేదు. పెళ్లాలు ధుమ ధుమ లాడుతున్నారు.

"అమ్మ వుంటే యిట్టాగయ్యేది కాదు" సోములు.

"ఛా ! యీళ్లకి సంసారాలేం తెలుసూ ! సినిమా టక్కులు తప్ప" నారాయణ వ్యాఖ్యానం.

"యింతకీ యీ పూట పనులు దక్కేనా మనకి?" రాములు అనుమానంగా ఆకాశంకేసి చూసుకున్నాడు. కణకణ మండుతున్నాడు సూర్యుడు. అది చూసేసరికి కోపం జ్ఞాపకం వచ్చినట్లు ముగ్గురు అన్నదమ్ములూ పెళ్ళాలను తిట్టి, తల్లిని తల్చుకుని, నాలుగు మెతుకులు కతికి బయటపడ్డారు.

శ్రీహరి, ఆ పూట భోజనానికి రానూలేదు. ఎవరూ అతగాడు వచ్చాడాని ఆలోచించనూ-లేదు. కాని వెంకట్రవణ మాత్రం కాలుగాలిన పిల్లిలా ముమ్మారు ఆ యింటి చుట్టూ తిరిగింది అసలు శ్రీహరి భోజనం చేశాడా అన్న బెంగ కనకమ్మ తనకి యిచ్చేసి వెళ్ళిందని ఆ పిల్ల వుద్దేశ్యం

## 18

తెల్లారింది. మునగాకు రాలింది. అయితే మునగచెట్టు చిగురించబోతున్నది. నారాయణ తన పెళ్ళాన్ని పిలిచి "యింద కూరకి డబ్బులు" అంటూ నలభై పైసలు చేత బెట్టాడు. రాములు తన పెళ్ళాన్ని పిలిచి అర్ధరూపాయి చేత బెట్టాడు.

అయితే సోములు యీ యిద్దరికన్నా ముందే బయటికిపోవడంచేత నాగరత్నం చేతిలో 'కూరకి' అని డబ్బులెట్టేవాళ్ళే లేకపోయారు.

నాగరత్నానికి తల తిరిగినట్లయింది. దుఃఖం, వుడుకుమోత్తనం కలిసి వచ్చేయి. గభిక్కున చేటా చీపురు పుచ్చుకుని, ఆ కసినంతా మునగాకుమీద, మునగచెట్టుమీద చూపించింది.

"దీని జిమ్మడ! దీన్ని చెట్లో తొక్క! ముదనష్టపు సంత! పాడుచెట్టు అత్తపీడ వొదుల్తుంది. ఆడబొడుచు పీడొదుల్తుందిగాని, దీని సిగదరగ, దీని, ఆకురాలుడు మాత్రం మాన్దు" ఆమె చీపురుతో బరికిన జోరుకి నేల పెచ్చులూడింది.

ఇది చూసి మిగిలిన యిద్దరు కోడళ్ళు వొకర్ని వొకరు చూసుకుని, ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. అది ఎంత గమనించరాదన్నా, నాగరత్నం మనసు వుండబట్టక మండిపోయింది. గబగబ తన గదిలోకి పోయి పెట్టె తెరచి ఏడు మడతలకి దిగువనున్న డబ్బీతీసి అందులోనించి ఒక పావలా తీసి యివతలికివచ్చి "వెంకట్రవణా!" అని యెదుటి గుమ్మం కేసి కేకేసింది.

వెంకట్రవణ యివతలికి వచ్చింది. "మాకీపూట కేదేనా కూర తెచ్చి పెడుదూ...తల్లి...తల్లి!" అన్నది.

రవణ వచ్చి "దాందేం భాగ్యం తెస్తాలే! పాపం మామ్మ వుండే బజారు కెళ్ళడం వొండడం అన్నీ చూసేదికదా" అన్నది యింట్లో తొంగి తొంగి చూస్తూ.

"మామ్మ లేపోతే సచ్చిపోతామనే...నేనెడతానులే బజారుకి పద ! మా అప్పకి మా మీద యియాళ కోపంగా వుందిలే" అన్నది సావిత్రి అమాంతం వెంకట్రవణ చేతిలో పావలా తీసుకుని.

"పద కలిసిపోదాం ! మీ అన్న పహిల్మానుగా...గుడ్డు లేందే ముద్ద తిగదుగా పద" అన్నది.

నాగరత్నం మాట్లాడలేదు.

బజారు తోవలో వెంకట్రవ ణడిగింది, "మీ మర్ది రాలేదల్లేవుందే ?" అని.

"ఏడ సచ్చేడో ? తల్లి వెనకాలే పోయాడేమో అంది !" సావిత్రి.

"లేదులే ! మామ్మతో వెళ్ళలేదు" తానేదో నోరు జారినట్టు సర్దుకుంది వెంకట్రవణ.

అంతేగాదు, మార్కెట్టు మొగని కిళ్ళీకొట్టు ముందర కారెంసు బల్ల దగ్గర కూచున్న శ్రీహరిని పసిగట్టేసింది. మొదట కేకేద్దామన్నంత వుబలాటపడింది. పిదప సావిత్రితో చెబుతా మనుకుంది. కాని ఆ కొట్టుని పది గజాల కవతల సైకిల్ షాపులో తన అన్న పహిల్మాను వుండటం చూసి గప్‌చిప్‌గా వూరుకున్నది. తన అన్న వెంకట్రవణ నేమీ అనడుగాని, శ్రీహరిని మక్కెలిరగ్గొడ్తాడు.

"పసిపిల్ల దానికేటెరుక ? అది పిలిస్తే వస్తావుట్రా !" అని తొడ చరుచుకుని మరీ కలియబడతాడు.

కాని మరి రెండు క్షణాల్లో సావిత్రికూడా చూసింది మరిదిని. చూడనట్లు నటిద్దామనుకుంది. ఎందుకేనా మంచిదని పయిట మెడచుట్టూరా లాక్కుని, ఎంతేనా శ్రీహరి నేస్తాలు. శ్రీహరి తన గురించి గౌరవంగా మాటాడుకోవాలనే కాంక్ష వుందిగదా ఆమెలో.

శ్రీహరి ఆట గెలిచి "ఎహె ! కాసుకోండ్రా ! నా ..." అంటూ లేచాడు. ఇటు తిరిగి రోడ్డుమీదిగా వెళిపోతున్న వొదినెగార్ని వెంకట్రవణని చూసాడు.

"వొదినోవ్ ! బజారొచ్చావా ?" అంటూ వచ్చేశాడు.

"మరే, మర్దిగారికి షైర్లెక్కువయ్యాయే ! కూటికేనా తిరికేడది ?" అన్నది సావిత్రి పైట మరింత మెడమీదిక లాక్కుంటూ.

"ఇదో యింద రూపాయి. మాంచి మేకమాంసం కొనొండు. యీపూట కొస్తా ; అన్నయ్యే లేటన్నారేం ?" అని ఆదుర్దాగా హడావుడిగా అడిగి, ఆ వ్యవధిలోనే వెంకట్రవణని తనివితీరా చూసుకుని "వస్తాగా మధ్యాన్నపేళకి" అంటూ చరాచరా వెళ్ళిపోయాడు.

"ఆట బాగా ఆడతాడు" అంది వెంకట్రవణ, రహస్యం చెప్పినట్లు సావిత్రితో.

"ఏమో ! యిట్టాంటి వోళ్లే ఓనాడు బాగుపడి మేడలు కడతారు" అన్నది సావిత్రి. మరిది తన చేతవుంచిన రూపాయి చెల్లేదో, చెల్లనిదోనన్నట్లు పరీక్షగా చూస్తూ.

వెంకట్రవణకి శ్రీహరి మేడలు కడతాడంటే వొళ్లు పులకరించింది.

## 19

వారం రోజులయినా కనకమ్మ తిరిగి రాకపోవడంతో కొడుకుల కారాటమూ, కోడళ్లకు హైరాన కూడా యెక్కువయింది. ముగ్గురి కోడళ్ళకీ మధ్య చిన్న చిన్న కీచులాట లారంభమై, అవి చిలికి చిలికి గాలివాన లయ్యాయి.

నాగరత్నం పూరు తెల్లారకుండానే ఒకనాడు తెగ తిట్టుకోవడం మొదలెట్టింది తనలో తనే.

"ఎదవలు ! పాపిష్టోళ్ళు ! వీళ్ల జిమ్మడ ! వీళ్ల చేతులు పడిపోనూ" యిదే ఆమె ధోరణి. మగవాళ్ళు ముగ్గురూ బయటికి పోయేదాకా మిగతా యిద్దరూ పూరుకున్నారుగాని, వాళ్లనటు పోనిచ్చి "నాగరత్నం ఎవర్నీ అట్టా శాపనార్థాలెడుతున్నావ్ ?" అనడిగింది రంగమ్మ.

"ఎవర్నా ? వాళ్ళ చేతులు పడ ! నా సొమ్ము గుంజుకున్న వాళ్లని."

రంగమ్మకి కుతూహలం ఎక్కువయ్యింది. సావిత్రి తనకి కాదన్నట్లు రోట పచ్చడి నూరుకుంటున్నది.

నాగరత్నం మొదట తిట్టినా కొద్ది క్షణాల తర్వాత గ్రుడ్లనీరు సైతం గ్రుక్కుకుంది.

రంగమ్మ యీ అదను బాగా వినియోగించుకుని "చెప్పకుంటే నేనేం పరాయిదాన్నా అప్పా ? యింకా సావిత్రి అట్టనుకుంటుందేమోగాని, నే న్నిన్ను సొంత అప్ప ననుకుంటా" అంది.

"కాదే తల్లీ ! నా మతి మండ ! నా పెట్టితాళం నొక్కడం మరిచినాల్లే వుంది మొన్న మావిడేళ" అని మళ్లీ గ్రుక్కిళ్లు మింగింది. చేతుల మెటికలు విరుచుకుంది.

సావిత్రి ఆ ఛాయలకు రాలేదు. తన పనిలో పూర్తిగా మునిగిపోయినట్లు నటించింది.

"మా కన్నవా రింటినుంచి అప్పుడో పైసా, అప్పుడో పైసా తెచ్చి కూడ బెట్టేనే పాతిక రూపాయలు !'' అని చెప్పి గుండె బాదుకుంది ఆవేశాన్ని, దుఃఖాన్ని అణుచుకుంటూ నాగరత్నం.

నాగరత్నం డబ్బు పోయిందనగానే అసలంత డబ్బు యెక్కణ్ణించి వచ్చింది దీని దగ్గర ? అనే దుగ్ధతోనూ, ఆ యింట ఆ అభాండం కాస్తా తన మీద వేస్తున్నదేమోనన్న భయంతోనూ, రంగమ్మ మొహం రంగులు మారి పులుముకుపోయింది.

"తల్లి తోడు !" అన్నది. "సత్తె[ప్రమాణికంగా నే నెరగనండి" నాగరత్నం రంగమ్మ కేసిగాక దూరంగా వున్న సావిత్రికేసి కసిగా చూసి, 'చుప్పనాతి అదేమన్నా తీసిందేమో ?' అని గొణిగింది.

"అమ్మయ్యా ! భగమంతుడి దయ నాయందుండబట్టి యియ్యాళ నిజం నీ కెరికయ్యింది" అని చేతులెత్తి దేవుడికి నమస్కారం పెట్టి, రంగమ్మ నాగరత్నం దగ్గరగా వచ్చి చెవులో ఏదో వూదింది.

"దానికి మహా చిల్లర తిళ్లెక్కువ మొగుడుచూస్తే కానీపైస యివ్వడు. కన్నవారేమో తినడానికి లేనివారయిరి. అనకూడదుగాని'' అనుమానా న్నంతటినీ తనమీంచి బరువు మార్చి సావిత్రి మీదికి నెట్టింది రంగమ్మ.

అయితే సావిత్రి మాత్రం ఏం తక్కువ తిన్నదా ?

"మొన్నరాతిరి దిగబడినాడుగా దొరవారు శ్రీహరిగారూ" అని పరోక్షంలో వున్న మరిదిమీదికి నెట్టేసింది. పైగా "బావగారికి చెప్పవమ్మా తల్లీ ! యెన్నాళ్లీ దొంగమారి కుంపటి గుండెలమీద" అన్నది.

''సరిలే ! మారాజుకి చెబితే మ[రెండన్న రాని...అతగాడిదో రభస" అని నిస్పృహపడింది నాగరత్నం.

కాని అదే సమయానికి "వొదినోయ్ ! వో నాగరత్నం వొదినే ! మా రంగమ్మొదిన మరిగంటే ... సావిత్రి వొదినే వొదినెల్లారా ! యిదో శ్రీహరి వచ్చినాడు తెచ్చినాడు శేరున్నర మాసం" అంటూ శ్రీహరి దిగబడ్డాడు.

ముగ్గురు కోడళ్లూ మూతి తిప్పుకోడంతో, శ్రీహరికి వుత్సాహమంతా చచ్చింది.

''పాడుచేతులు ఎక్కడ కన్నమేసి పట్టుకొచ్చాయో?"అంది సావిత్రి మునగ చెట్టుమీది కాకి నుద్దేశించి అన్నట్లు.

"కుక్కబుద్ధి !" పుట్టకబోవాలేగాని, పుట్టినాక మరి పుడకలదాకా పో"దన్నది రంగమ్మ 'కాకా' మని ఎగిరిపోయిన కాకి నుద్దేశించినట్లు.

శ్రీహరి కూలబడ్డాడు. "ఓరి ఎదవసంత మండా !'' అని గొణుక్కున్నాడు. కాని అతగాడికి అసలు సంగతి తెలియడానికి అయిదు నిమిషాలు మాత్రమే పట్టింది.

సూటిపోటిమాటలతోగాక, నోటిమాటలతో వొదినెలు తనమీద దొంగతనం ఆరోపించడంతో, వాడు విజృంభించి వెర్రెత్తిపోయాడు.

ముగ్గుర్నీ కలిపీ, విడివిడిగానూ తెగతిట్టాడు.

ముగ్గురూ కూడా ఆడతిట్లు కలిసీ, విడిగానూ కూడా తిట్టారు. మొగుళ్ళు రావాలిగాని వస్తే అటో యిటో తేల్చేస్తా మన్నారు.

శ్రీహరి నెత్తిన రాలిన మునగాకు నయినా దులుపుకోకుండా తెచ్చిన మాంసం మునగచెట్టుక్రింద పారేసి బయటపడ్డాడు.

చెట్టుమీద కాకులువాలి, కోడళ్లకంటే అల్లరి సాగించాయి.

బయటపడుతున్న శ్రీహరికి వెంకట్రవణ కనపడ్డంతో గుండె గతుక్కుమంది. మరింత వొళ్ళు వేడెక్కింది.

వెంకట్రవణ నించున్న భంగిమ; కోపాన్నీ, అసహ్యాన్నీ సూచిస్తూవున్నా కళ్ళల్లో ఆర్ద్రితా, సానుభూతీ వున్నాయి.

"నా మీ దొట్టు పెట్టుకోని సెప్పు...నువ్వు తియ్యలేదా ?" నిలదీసింది.

వెంకట్రవణ కళ్లల్లోకి మండుతూ చూసాడు శ్రీహరి.

"నీకూ నమ్మకం లేదా ?" అన్నాడు నీరసించినట్లు.

వెంకట్రవణ మాటాడలేదు.

"మా యమ్మలాంటి ఆ మునగచెట్టు మీదొట్టు ! నీ మీద వొట్టు ! నే నెప్పుడూ మా యమ్మ పెట్టి తప్పిదే, మరోపైస దబ్బు తియ్యలేదు" అనేసి వెళ్ళిపోయాడు.

వెంకట్రవణ పిలుద్దామనుకుంది. ఆమె పెదవులు విడలేదు. కన్నులలో నీళ్ల నిండాయి.

## 20

శ్రీహరి తిరిగి రాకపోవడంతో నాగరత్నం తాను నమ్మడమేగాక భర్తని నమ్మించింది కూడాను. సావిత్రి తనకు దాతనయిననన్ని విధాలా నగరత్నాన్ని వోదార్చింది. శ్రీహరిమీద తనకి యిటువంటి అనుమానం మొదట్నుంచీ వున్నదంది.



సోములు, తమ్ముడు దొంగతనం చేశాడన్న కోపంలో తన భార్య "కంత సొమ్ము ఎక్కడ"దని అడగనేలేదు.

"ఇంటా వంటాలేదు. దొంగ బుద్ధి! కాలో చెయ్యో విరిచేస్తా" అన్నాడు మండిపడుతూ.

శ్రీహరిమీద ఎవరికీ జాలి కలగలేదు. సానుభూతి యింత పిసరులేదు. మునగచెట్టు సంగతి తెలియదుగాని ఒక్క, వెంకట్రవణ అంతర్యంలో తప్ప శ్రీహరికి నిజాయితీగల వాడన్న స్థానంలేదు.

శ్రీహరికి వొదినె లన్నమాట గుండెల్లో గునపం పోటు లాంటిది. అతగాడిని కనకమ్మ ఎన్నిసార్లో దొంగవని తిట్టింది. నానా మాటలూ తిట్టింది. నిజానికి తల్లి పెట్టిలోనించి, కొంగునించి తను డబ్బులు సంగ్రహించడం మామూలే అవడంచేత అవేమీ అతగాడిక్కి లెక్కలోకి వచ్చేవికాదు.

తల్లి లేకపోవడంతో శ్రీహరికి మాట నొప్పి తెలిసింది. తల్లిని చూడ్డా మనిపించింది. హోటల్లోకి వెళ్ళి భోజనం ఒక్క ముద్ద తినలేకపోయాడు.

"అమ్మా!" అని అతని గుండెల్లో ఎవరో ప్రతిధ్వనించినట్లు కేకేసి నట్లయింది. పరిగెత్తి బస్సెక్క బోయాడు.

"కొండలి కెట్టాగుందో"నని గొణుక్కుంటూ బస్సుకమ్మీ నందుకున్నాడు.

''ఓరి శీహరీ! ఏడకిరా?" అని ఎవరిదో కేక విని "మా అమ్మ దగ్గరికి రాగురో!" అని హుషారుగా కేక వేశాడు.

వాడికి దుఃఖోపశమనం కలిగింది. తల్లి దగ్గరికి వెళ్తున్నాను గదాని వుప్పొంగిపోయింది మనసు వెయ్యి ఏనుగుల బలమేదో లభించినట్లయింది.

* * *

శ్రీహరి అల్లంత దూరాన సందు మలుపు తిరిగేసరికే కొండలు యింటి ముందు జనం మూగివున్నారు. కొండలి రోదన, కనకమ్మ యేడుపూ వినిపించి శ్రీహరి పరిగెత్తుతున్నట్లు అక్కడికి వెళ్ళేడు.

జనాన్ని తోసుకుని మధ్యకి వెళ్ళేసరికి నిలువునా స్తంభించిపోయాడు. గుండెలంతా దేవినట్లయింది.

భర్త శవంమీదపడి కొండలు గుండె అవిసిపోయేలాగ ఏడుస్తున్నది. కనకమ్మ ''ఎంత అన్యాయం జరిగిందే? నా కూతురో!" అని గుండెలు బాదుకుంటున్నది.

చేరిన నలుగురూ రకరకాలుగా వోదార్చాలని చూసినా, రోదన మరింత ఎక్కువయింది.

శ్రీహరి కూడా "అమ్మా!" అని ఒక్క కేకవేసి బావురుమన్నాడు.

"చాతబడి చేస్తే యింక దక్కదన్నది ఖాయమే" అని ఒకరంటే;

"ఏమోనమ్మా! రుణం తీరింది ఒకటా, రెండా? మూణ్ణెల్లు యమయాతన" అన్నది మరో యిల్లాలు.

కొండలికి వైధవ్యం ప్రాప్తించింది. ఆ పిల్లకింకా ముక్కుపచ్చలారని బిడ్డ వున్నాడు.

వాడికి "నాన్నా" అన్న పిలుపు రాకుండానే తండ్రి కరువయ్యాడు. ఇక భాషంతా నేర్చుకున్నా ఆ మాట వెలితిమాత్రం ఆ పసివానిదే

కొండలు రోదించి రోదించి స్పృహ తప్పిపోయింది.

కనకమ్మ రొమ్ము కండిపోయి అదే పనిగా బాదుకున్నందున వాచి పోయింది.

కాని దేవుడికి దాతగాని ఆ పనిని యిద్దరాడవాళ్ళేం చేయగల్రు ?

పోయిన ప్రాణం పోయింది.

## 21

శ్రీహరి అన్నలకి కార్డురాసి పడేశాడు. కొండల్ని వోదార్చేసరికి వాడి ప్రాణాలు తోడుకుపోయేవి. కనకమ్మ కొండల్ని, వోదార్చినకొద్దీ ఏడవడంతో వాడికి ప్రాణం విసిగి అవతలికి పోయేవాడు.

చెల్లెలికి వైధవ్య మొచ్చిందన్నవార్త రాగానే అన్నదమ్ములు ముగ్గురూ కుప్పలా కూలిపోయారు.

"దాతబడి అన్నప్పుడే అనుకున్నా" అంది నాగరత్నం.

"ఎంతఘోరం !" అన్నది రంగమ్మ. సావిత్రి యిరుగు పొరుగులకి చెప్పింది.

పార్వతీ రాజయ్యలతో సహా అంతా పరామర్శకి వచ్చారు.

మునగచెట్టు పూతపూసింది కాని, వుండేవుడిగో కన్నీళ్ళలా పూవురాల్చింది.

పరామర్శకి మీరు వెళ్ళి తీసుకురావాలని, వీధిలోని పిన్నా పెద్దా, యిరుగూ పొరుగూ తీర్మానించడంతో సోములుతప్ప తతిమ్మా అంతా ప్రయాణ మయ్యారు.

మొదటి రోజంతా ఆడబొడుచుకి తగిలిన యీ విధి ఘాతానికి విచారం వెలిబుచ్చినా, యికమీదట తమ పీకలమీదికే గదా యీ బరువని బాధపడ్డారు కోడళ్ళు.

సోములు మాత్రం యింటిపట్టున వుండిపోవల్సి వచ్చింది.

* * *

ఆవేళరాత్రి కనకమ్మ కుటుంబ విషయాలే మాటాడుకుంటున్న రాజయ్య పార్వతీ దంపతులకి ఒక గొంగళీపురుగు, మునగచెట్టు గురించి జ్ఞాపకం చేసింది.

"ఛీ ! ఛీ ! యీ పాడుసొద ... ముదనష్టపుచెట్టు" అని గొంగళీపురుగుని విదిలించుకుంది పార్వతి.

రాజయ్య "యీ కొంప అమ్మి మరో దగ్గరికి పోదామేంటి ?" అన్నాడు విసుగ్గా.

"ఆఁ ! వుట్టికెక్కలేనమ్మ సొర్గానికెగురు తుందిట. ముందేమో ఆ చెట్టు నరికేస్తానని బీరలూనూ, యిప్పుడేమో కొంప నమ్ముకు పోదామని" అని ఎకసక్కెమాడింది పార్వతి.

అమాంతం లేచి కూచున్నాడు రాజయ్య. "నరికేద్దునా ?'' ఎవరూ లేరు గంద..." అన్నాడు.

పార్వతి గభిక్కున వారించింది.

''ఎందుకులే పూసేపిందే, కాసేకాయాగా వున్నది చెట్టు. నే నుట్టి మనిషిని కూడా కాదంది."

రాజయ్యకి ఛెళ్ళున చరిచినట్టు సంతోషం కలిగింది.

భార్య నమాంతం కౌగిట బంధించి "దొంగా ! నా కాదే దాచావా ?" అన్నాడు.

మునగచెట్టు కానాటి గండం, ఆ విధంగా తప్పింది.

* * *

మర్నాడు మునగచెట్టు యిల్లు బోసిగా ఆగుపించింది.

పార్వతికి మునగాకునంతా వూడ్చుకుంటూ విసుగుదలకి మారుగా ఏదో సంతృప్తి కలిగింది.

పాపం ! కొండలు నిన్న మొన్నటిపిల్ల. ఎంతకష్టమొచ్చింది అని బాధ పడింది. మూడురోజులనాటికి శ్రీహరితో సహా ఒక్క కనకమ్మ తప్ప అంతా వచ్చేశారు.

వెంకట్రవణకి శ్రీహరిని చూడగానే సంతోషమయింది.


పరామర్శించ వచ్చిన వాళ్ళను పలకరించుతున్నదేగాని చూపులన్నీ శ్రీహరిమీదనే.

శ్రీహరి కూడా చాలా పెద్దమనిషిలాగ గంభీరంగా కూచుని ఓసారి వెంకట్రవణకేసి చూసి, అక్కణ్ణించి లేచి బయటికెళ్ళిపోయాడు.

"మరి మామ్మ రాలేదేం ?" అన్న వెంకట్రవణ ప్రశ్నకి సావిత్రి చెప్పింది ఎట్టాగొస్తది ? మా ఆడబొడుచును కూడా తీసికొని మాసికాలయ్యేక" వస్తదని —

## 22

కోడళ్ళు రెండు రోజులో యేమో, కొంచెం పొత్తుగా వున్నారు. ముఖ్యంగా యిద్దరు గాక ముగ్గురవడంతో వాళ్ళకి పొంతులు తెగలేదు. మొద టను




కున్నారు; నాగరత్నం మధ్యాహ్నం వొండాలి రంగమ్మ రాత్రిపూట వంట చెయ్యాలి పోతే సావిత్రికి పై పెత్తనం. అంటే వూడవడం, బజారు పనులు చేయడం యిత్యాదులు.

రెండు రోజులు తిరగకుండానే మధ్యాహ్నపు వంటకంటే రాత్రి వంట యెంతో సుళువనే పరిపూర్ణ విశ్వాసం యేర్పడిపోయింది నాగరత్నానికి. అసలు "మాపిటేళ సీకట్లో యీ చావుకన్న మధ్యాహ్నమయితేనా" అన్నది రంగమ్మ. అదీగాదు, యిదీగాదు దాని పని యెంతేనా బాగుంది తిరగడం పెత్తనాలాడ్డం తప్ప, మరోటి లేదన్నారు ఆ యిద్దరూ. సావిత్రి వొళ్ళు మండిపోయిందిం.

"ఈ మునగాకు ఎత్తిపోసేసరికి నడుం పడిపోతున్నది. నా కొద్దమ్మా యీ సంతచాకిరీ. ఎవరి కొంపని? ఎవరి బ్రతుకులని? నా మొగుడు కేంటి కావాలో నేను వొండుకునే హక్కు లేకపోయిన తర్వాత" అని రుసరుసలాడింది సావిత్రి.

దాంతో మిగిలిన యిద్దరికీ అక్కసు ఒక్కసారి పెల్లుబికింది.

"ఎవడేడికాడు నీ మొగుడూ, నువ్వూ వేరై బతకరాదా? కులుకరాదా? మాకేమేనా ఒరగబెడతున్నారా? మీ కుంభాలు!" అని తిరగబడ్డారు

మునగచెట్టుమీద కాకి వాలింది. కోడళ్ళ తగువు తీర్చేందుకు, కనకమ్మ పంపిందా అన్నట్లు ఒకటే 'కాకా' మనసాగింది. ఇరుగూ పొరుగూ చేరారు.

"అవునుసుమా! ఒక ఒరలో రెండుకత్తులు యిముడవు!" యింతకీ ఎవరి బ్రతుకులు వాళ్ళు బ్రతకడం వుత్తమం యీ రోజుల్లో. అని కొందరు తీర్మానిస్తే; మరికొందరు, ముసిల్ది లేకపోవడమే యీ మోసగానికి కారణమని గుసగుసలు పోయారు.

పర్యవసానమేమిటి ?

ఆ రాత్రి ఎవరి వొంటలు వాళ్ళు వేర్వేరుగా వండుకున్నారు. మునగచెట్టు క్రింద వున్న ఒక్కపోయి మీదనే, ఒకరి తర్వాత ఒకరు వండుకుని, ఒకే వరండామీద వేరే పెట్టుకున్నారు.

అన్నదమ్ములు ముగ్గురూ జరిగిన యీ మార్పుని సాధ్యమయినంత గుర్తించనట్లు నటించారు.

మర్నాడు వుదయం ఎవరి పనుల్లోకి వాళ్ల పోతూ, ఒకరి మొహం లొకరికి కనిపించనంత దాచుకున్నారు.

శ్రీహరి యింటికొచ్చి, మూడు అన్నం చట్టి లుండటం చూసి, "దుంపతెగ! ఆడాళ్ల ఏరైపోయారన్నమాట" అన్నాడు.

ఆ మాటకి సావిత్రిగాని, నాగరత్నంగాని ఏమీ అనలేదు.

"పొద్దుముండా పిల్లి! దీనికి పగలూలేదు, రాత్రీలేదు'' అని దాన్ని తరుమడంలో నిమగ్నమయ్యారు.

రంగమ్మ మరిదికేసి ఆప్యాయంగా చూసి "రా! బాబూ! కాళ్ళు కడుక్కురా! కూడెడతా'' అన్నది. అని, తోడికోడళ్లకేసి గర్వంగా చూసింది.

శ్రీహరికి నోట ఏమాటా పెగల్లేదు. పైమీద తుండు తీసుకుని స్నానానికి వుపక్రమించాడు.

అయితే "నాకు యిల్లు లేదన్నమాట" అని గొణుక్కున్నాడు. "అమ్మ రావాల యీ కొంప బాగుపడాల" అనుకున్నాడు. "పోనీ నా పెళ్ళామొస్తే" అన్న ఆలోచన కలిగింది. మరి చెంబుడు నీళ్ల నెత్తిన పోసుకుని వాడిలో వాడే తన్మయమైపోయి, "ఎంకట్రవణని చూసి పోవాలి" అనుకున్నాడు

శ్రీహరి వ్యాపారంలో దిగాడు. ఒకరకమైన వ్యాపారంకాదు. వాడివి రకరకాల వ్యాపారం. మూడు ముక్కలాట లాడగలడు. లాటరీలుపెట్టి అలగా జనానికి మస్కాకొట్టి కనీసం మూడు రూపాయిలైనా ఆర్జించగలడు.

రంగమ్మ పీట తెచ్చివేసి కంచంనిండా అన్నమూ పులుసూ తెచ్చి పెట్టింది. సుష్టుగా తిన్నాడు.

"అమ్మ నాలుగు రోజుల్లో కొండల్నికూడా తెస్తది" అన్నాడు భోజనం ముగిస్తూ. "మరి తప్పుద్దా, ఆడదివుంటే అత్తింటా, అది తప్పితే పుట్టినింటా వుండొద్దా ?" అని వ్యాఖ్యానించింది నాగరత్నం.

"ఇదో శ్రీహరీ! మీ అన్నయ్య వొక్కపొడి తెచ్చాడు యిందా" అని వక్కపొడి యిచ్చింది సావిత్రి.

శ్రీహరి పీళ్ళలో కలిగిన యీ మార్పులకి విస్తుపోయాడు.

'వేరింట కాపురమే భేషుగ్గా వుంటుందన్నమాట" అనుకుని జేబులోనున్న అర్థరూపాయి తీసి,

"రంగమ్మోదినా! యిదో! కూరకొనుక్కొచ్చుకో!" అని అక్కడ పెట్టాడు.

"ఛీ! ఛీ! ఏం పని బాబూ అది? మా కింకా అంత బరువవలేదులే నువ్వు" అన్నది రంగమ్మ అర్థరూపాయి కేసి జాలిగా చూస్తూ.

"మా అమ్మలాటి దీ మునగచెట్టు దీని సాక్షిగా అది నా కష్టార్జితం'' అని అక్కడపడేసి, ఆ అర్థరూపాయికాసును శ్రీహరి బయటికి నడిచాడు.

రంగమ్మ అర్థరూపాయి తీసుకుంది. సావిత్రి, నాగరత్నం చెవిలో "పూట కూళ్ళతంతు!" అని వూదింది.

* * *

పార్వతి రాజయ్య లొక్కరే యిదివరకు ఒకపక్షమై మునగాకు విషయంలో పోరాడవల్సి వచ్చేది. ఇప్పుడు కోడళ్ళు ముగ్గురూ మూడు పక్షాలై, అందుకు తలపడుతున్నారు ఈ పోరు పడలేక అన్నట్టు మునగచెట్టు పూతపట్టింది.

## 23

కనకమ్మనీ, కొండల్ని బస్సుదగ్గరే శ్రీహరి కల్సుకున్నాడు. కొండలు శ్రీహరిని చూస్తునే బావురుమంది. బస్సుస్టాండులో శ్రీహరికి ఆ పిల్లని ఓదార్చటం ప్రాణసంకట మయింది.

తోవలోనే యింటి పరిస్థితులు 'తీన్ తేరా' అవటం గురించి, విని కనకమ్మ కూడా లబో దిబో మంది.

కోడళ్ళు ముగ్గురూ గుమ్మంలోనే "అత్తయ్యా!" అంటూ "అయ్యో! కొండలూ!" అంటూ బుడిబుడి దుఃఖాలుతీశారు.

కొండల్ని ఓదార్చడంలో పార్వతికి, వెంకట్రవణకి కూడా గుండెలవిసి పోయాయి.

ఆ రోజు రోజంతా ఆ యిల్లు ఏడుపులతోనే నిండిపోయింది.

"కొండల్ని ఒకర్తినే వదలిపోలేదు యీ భూమ్మీద. ఆ మూడేళ్ళ పసికందు నేం పెంచుతుందీ పిల్ల?" అని నలుగురు మరింత సానుభూతి ప్రకటించారు.

మర్నాడు కోడళ్ళు ముగ్గురూ కూడా అత్తగారితో ఎవరు ముందు మాటాడుతారా అన్నట్లు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

కనకమ్మ "అయ్యో భగవంతుడా! యీ కొంప యిట్లా ముక్కచెక్కలై పోవాల్సిందేనా?" అని వాపోయింది

శ్రీహరి రంగంమీద ధైర్యంగా దిగాడు "అమ్మా!" అన్నాడు. ఆవేశంగా వదినల్ను కసిగా చూస్తూ "నాకు దేవుడు రెక్కలిచ్చేడు. కొండమ్మకా నాని మొగుడి ఆస్తిలో దానికి, దాని బుడ్డడికి అట్టట్ట కాలం వెళిపోతాది. నీ భరవసా నాది. యీ యింట నువ్వూ నేనూ వేరేకాపరం. యిది కాయం" అని విసురుగా రెండురూపాయల కాయితం యివతలపడేసి, కొండలు కొడుకు చంద్రుడిని భుజాన వేసుకుని, అవతలికి పోయాడు.

"అడికేంటి తక్కువే? మారాజు. యీ చుప్పనాతివోళ్ళ కూడు ఆడికెందుకు చెట్టంత తల్లి వుండగా?" అన్నది కొండలు తల్లి నోదారుస్తూ.

కనకమ్మ కొన్ని క్షణా లలాగ దిమ్మఖారి కూచుని "నీ దగ్గర రెండొందలో, మూడొందలో పెట్టి బఱ్ఱెని కొనుక్కోమంది." లేచి బుట్ట తీసుకుని బజారుకు నడిచింది.

వెంకట్రవణ "మామ్మా!" అంటూ వెంటబడ్డది. "అమ్మదొంగా! ఎక్కడ కాసేవే మాయమ్మ! మా తల్లీ!" అన్నది కనకమ్మ రవణ తల నిమురుతూ.

కనకమ్మ కష్టం, సుఖం చెప్పుకుందికి వెంకట్రవణకంటే దగ్గర ఎవరూ లేరు. చెప్పింది, "కొండలికి దాని మరుదులు సాలీనా ఐవొందలు పంపుతా మన్నారు. పోతే దానికాడ నున్నదాంతో ఓ బఱ్ఱెను గొన్నదా, పాల వాడికలు పెట్టుకుని, దానిబతు కది బతుకుతాది."


వెంకట్రవణ శ్రీహరిగురించి అడగబోయి వూరుకుంది. "వాడూ, నేనూ, కొండలు కలిసివుంటా" మన్నది ఆ సంగతి గ్రహించినట్లు కనకమ్మ.

* * *

ఆ విధంగా, ఆ సంవత్సరం మునగచెట్టు పిందెవేసే వేళకి కనకమ్మ యింట నాలుగు పొయ్యిలు లయ్యాయి. అయితే ఆ యింట నాలుగు కాపురాలుండే అవకాశం లేదు. మూడు గదులలో ముగ్గు రన్నదమ్ములూ వుంటే వసారా అంతా కలిసి వాడుకుంటే మిగిలిన కొట్టు కనకమ్మకి, కొండలికీ దక్కింది. పెళ్ళాం లేని శ్రీహరికి మునగచెట్టు నీడే యిల్లు?

వారంరోజులకి కొండలు ఆ యింట పాతదయ్యింది. నాగరత్నానికీ, సావిత్రికీ, రంగమ్మకీ అదబొడుచయ్యింది.

"తమకి అదబొడుచూ, అత్తగారూ. యీ యిద్దరూ యముళాల్లు" అని భావించే వాళ్లల్లో కోడళ్లు ముగ్గురూ ఏకీభవించారు.




గేదెను మునగచెట్టుకు కట్టింది కొండలు. అయితే వానొచ్చేసరికి అది మరింత రొచ్చుచేసేది. దాంతో కొండల్ని రంగమ్మ, సావిత్రీ, నాగరత్నం ముగ్గురూ, వంతులవారీగా, ఒకరి తర్వాత ఒకరు, కాకిమీదా, పిల్లిమీదా పెట్టి తిట్టేవారు.

"ఛీ!ఛీ పాడుసంత...మా యింటిమీద వచ్చిపడ్డ"వనే వారు కాకిని తోలి.

మునగచెట్టు యింట యిన్ని మార్పులొచ్చాయి. అయితే యిందులో రాజయ్య పార్వతుల సమస్య యేమీ తీరనేలేదు.

అడపా తడపా ఆ యింటి ఆడమగల మధ్య వాగ్యుద్ధం జరుగుతూనే వున్నది.

ఏదో ఒకవేళ ఆ మునగచెట్టుకు నరికేస్తానని రాజయ్య ప్రతిన పూనుతూనే వున్నాడు.

* * *

ఒకనాడు హోరున వాన కురిసింది. గేదె వానలో తడిసింది. అది పాలిచ్చే వేళ తాటాకుగొడుగు, దానిమీద మునగచెట్టు కొమ్మలూ కూడా తట్టుకోలేని వర్ష ధారలు కొండల్ని తడిపి ముద్ద చేశాయి.

గేదెకి కూడా తుమ్ములొచ్చాయి. కొండలికి చలిజ్వర మొచ్చేసింది.

శ్రీహరి ఆలోచించి "యీ మునగచెట్టు జాగాలో పాకొకటి వేయిస్తానే కొండమ్మా, నీ కోసరం" అన్నాడు, చెల్లెలిమీద వాత్సల్యంతో.

ఇదంతా తొలుపుకుంటూ నాగరత్నం విన్నది.

"ఎవరి బాబుగాడి సొత్తనీ...పాకలూ, దొడ్లూ వేయిస్తారో?" అన్నది జనాంతికంగా

"మా బాబుగారివనే వేయిస్తాం..." అన్నాడు శ్రీహరి కసిగా.

"అదేదో మీ అన్నయ్య వచ్చాక తేల్చుకో" అంది రంగమ్మ.

దాంతో శ్రీహరికి తారకమెత్తి, "మీకు మొగుళ్ళు గాని, నాకు కారుగా? రానీ తేల్చేద్దాం" అన్నాడు.

కినకమ్మకి ఆమాట లంతరార్థం తెలియగానే కూలబడి దుఃఖించసాగింది.

కొండలొచ్చి, "ఎందుకేటే దుఃఖమూ?... మా మరిడిని యియ్యాలరప్పించి, ఆ జాగా అమ్మితే అదే కొనేస్తా" అంది కనకమ్మనివోదారుస్తూ.

అయ్యో తల్లీ! నీ సొంత తల్లిదగ్గిర నీకు సెలవనీడ లేదటే!... నని వాపోయింది కనకమ్మ.

"అదే పాయెటే ఏ నాటికేనా, నా బిడ్డా నేను రోడ్డున పడాల్సిందేగా? నువ్వున్నన్నాళ్ళే యీ బ్రతుకేనా... యియ్యాళ మా మరిడికి కబురెట్టు; అయిన కాడికి పొలం మీద అప్పెట్టి యీ మునగచెట్టు జాగా కొని పాకేసుగుంటా" అంది నిశ్చయంగా కొండలు

"అది మీనాయిన లాంటిది—దాని నీడను నీ బిడ్డడు తాతయ్యంత వోడవతా" డంది కనకమ్మ కూతురినిర్ణయానికి తలవొగ్గుతూ.

## 24

సోములు, రాములు, నారాయణ ఈ ముగ్గురూ పెళ్లాల చేతుల్లో కీలు బొమ్మలమనీ; మౌనంగా వొప్పుకున్నారు? శ్రీహరి తిరుగుతున్నప్పుడు కూడా "ఒరేయ్! నీవు చిన్నోడివి...ఎందుకేనా మంచిది, దాని జాగా దానికుణ్ణియ్యి... నోటూ పత్రమూ వున్నాకా... ఎవరికేనా మంచిది" అని సర్దుకువచ్చారు.


పదిహేనురోజులయ్యేసరికల్లా మునగపిందెలల్లా, కాయలయ్యేయి. దాని నానుకునే కొండలికీ గేదెకి పాక కూడా లేచింది.

కనకనమ్మ వొంట కుపక్రమించింది. ఒకనాటి వుదయం పడమటికొండల కేసి ఒకటీ అరా మేఘాలు చేరుకుంటున్నాయి.

పసారాలో కోడళ్ళు పొయ్యి రాజేసుకుంటున్నారు.

అడుగున్నర సాగి ఎండలో మిలమిలా మెరుస్తూవున్న మునగకాడ ఒకటి కొండలి కొడుకు చంద్రుడి నాకర్షించింది

"అమ్మా! అమ్మా! మునగకాడే" అన్నాడు వాడు.




కొండలికి మనసు పోయింది.

"పప్పుచారులో పడేయ్యి అమ్మా! నీ మనవడికి. వేపిళ్లు" అని నవ్వుతో గదకర నెత్తుకొచ్చింది కొండలు.

అన్నం కలియ బెడుతున్న కనకమ్మ కా మాటే వినిపించలేదు.

చంద్రుడు చప్పట్లు చరుస్తూ ఆనంద పారవశ్యంలో గెంతులు వేస్తూ వుండగా, పుటుక్కున తెగిపడింది మునగకాయ.

కనకమ్మ అన్నం కుండనట్టే జార్చేసింది కొండలికి యింత వుపద్రవానికి తానే కారణమని రెండు క్షణాలగానా తెలిసిందేకాదు.

అది వీధిలోంచి వస్తూ సావిత్రి చూసింది. ఒక్కసారి "ఓలమ్మో కొంత కూలిం"దనిగావు కేకేసింది.

నాగరత్నం వులిక్కిపడి యిటుతిరిగి...''రంగమ్మోయ్! యిటు చూడు!'' ఒక్క గెంతున వచ్చింది.

"దేవుళ్ళుంటారు. దెయ్యాలుంటాయి. యింకా నిండా పూత్తైనా పెట్టనిచెట్టు. దుంపరాల్చడానికి నీ చేతులెట్టా వచ్చాయో! అయ్యో! చెట్టంతామేకలకి మేపిందాకా అన్నట్లు ఎట్టా రాల్చిందో!" అని విరగబడ్డారు కోడళ్ళు.

కొండలికి దుఃఖమూ వుక్రోషమూ పెనవేసుకొచ్చాయి.

"ఛి ఛి; ముదనష్టపుగోల! నాజాగా. నా మునగచెట్టు. నే కోసుకున్నా" అని ఏడుస్తూనే విజృంభించింది.

పార్వతి సైతంగా యిరుగు పొరుగూ చేరారు. కనకమ్మ శోషెత్తిపోయింది.

"స్థలమమ్మితే చెట్టు అమ్మినట్టవుద్దా? దీని చేతులు పడ! మా దేవుడి లాంటి మునగచెట్టు నిరి చెడగొడుతున్నాది" అన్నారు కోడళ్ళు.

"మునగచెట్టు నాదే పాపిష్టి బొమ్మల్లారా!" అన్నది కనకమ్మ.

"నా కష్టార్జితం చచ్చి సొర్గానవున్న నా మొగుడుముల్లె" అన్నది కొండలు.

ఆ తగువు అట్టా మిట్టమిధ్యాహ్నందాకా, సాగుతూనే వున్నది. సోములూ, రాములూ నారాయణ రావడంతో అది వుగ్రరూపం దాల్చింది.

సోములు చెల్లెలి పక్షం వహించడంతో, అన్నదమ్ములు చేతులు కలిపారు. కనకమ్మ మధ్యనపడి "దున్నపోతుల్లారా!" అంటూ దున్నల్లాంటి ఆ ముష్కరులను తన చేతి యిత్తడి కడియాలతో మొత్తి విడదీసింది.

చివరికి కొండలికి మునగచెట్టుమీద ఎటువంటి హక్కులేదనీ, అసలామాటకి వస్తే మునగచెట్టు యెవరి హక్కూ కాదనీ, వుమ్మడి సొత్తనీ తీర్మానం జరిగింది.

దాని ఆకు నందరూ వూడుస్తున్నారు. దాని సంరక్షణ అందరూ చేస్తున్నారు. గనక కోడళ్ళు ముగ్గురూ కలిసి ఒకనాడు ఆ కాయలను కోసి నాలుగిళ్ళకూ పంచాలి. అని తీర్మానించడంతో మధ్యాహ్నం సాయంత్ర మయింది.

ఆకాశమంతా మునుకుపట్టింది. ఈదరగాలి వీచి, అది కాస్తా తగ్గి తుంపర రాలింది.

ఆ తుంపర జడివానగా మారే సూచన లగుపించాయి.

కొండలు కనకమ్మ వొళ్లో తల దూర్చి మొగుణ్ణి తల్చుకుని ఏడ్చింది.

పార్వతి "వీళ్ళ దుంపతెగ! పొరుగుని మసల్ని జతక నివ్వరల్లేవుంది" అని విసుక్కున్నది. కాలి మువ్వలు నేలకొట్టింది.

గాలీ, వాన వుధృతం జాజొచ్చాయి. "చూశావా! మునక్కాయలు పంపకం?" అన్నాడు రాజయ్య భార్యతో వెచ్చగా చుట్ట కాలుస్తూ.

"నీ చాతకానితనం కూడా మాకా! అసలా చెత్తనంతా ఎత్తేది నేను. నా పేరే తలపెట్టేరుగాదు, ముదనష్టపు నంత!" చేతుల మెటికలు రాజయ్య మొహంమీద విరిచింది పార్వతి.

## 25

వాన గాలివానగా రూపందింది. శ్రీహరి యింటికి చేరలేక, చేరడం యిష్టం లేక కాకా హోటల్లో టీ చప్పరిస్తూ మధ్య మధ్య వెంకట్రవణని మధ్యాహ్నం తాను మ్యాటినీలో చూసిన సినిమా హీరోయినుతో పోల్చుకుంటున్నాడు.




వెంకట్రావణ తలుపులన్నీ వేసుకుని, వెచ్చగా, కప్పుకుని "సచ్చినోడు. శ్రీహరి యిల్లు చేరాడో లేదో?" అని శ్రీహరిని కలలు గంటున్నది.

అందరూ ఏడుగంటలకే చలికీ, వానకీ, ఝడిసి యిళ్ళల్లో చేరి ముసుగులు తన్ని పడకల కుపక్రమించారు

మునగచెట్టు దయ్యం పట్టినట్టు రివ్వు రివ్వున వూగసాగింది. వింటే కాయా కూడా రాల్చసాగింది.

కనకమ్మ మనుమణ్ణి చేర్చుకుని ముడివేసుకుని కుక్కి మంచంలో శ్రీహరి రాక కెదురుచూస్తూ కునకసాగింది.

కొండలు తన "బ్రతుకెంత దిక్కుమాలింది?" అని కసిగా దైవాన్ని తల పోయసాగింది.

సోములు నాగరత్నం ఆవతలి గాలి వాన సంగతి మరిచిపోయారు.

రాములూ నారాయణ మాత్రం పెళ్ళాలు లేనివాళ్ళా?

ఎంత రాత్రి అయ్యిందో ఎవరికీ తెలీదు. హోరున వాన, ఝోరున గాలి. ఎక్కడో పిడుగుపాటు. ఏదో కూలిన శబ్దం. మళ్ళీ గాలీ వానా.

గేదెపడ్డకి అరిచి అరిచి గొంతు పడిపోయింది.

పార్వతికి తెలివొచ్చింది. రాజయ్య గురకసైతం వినిపించనంతగా గాలి వాన హోరు పెడుతున్నది.

"ఇదో తలుపులు గడలిరిగేట్టున్నాయి. కాస్త చూద్దూ!" అంటూ భర్తను లేపింది పార్వతి.

రాజయ్య కలవరిస్తున్నాడు.

''అహ్హహ్హా ! నరికేశా ! నరికేశా ! పార్వతీ ! మునగనష్టను మునగచెట్టు నరికేశా !'' అంటూ.

పార్వతి కనతల ఏదో గుభేలున కూలిన చప్పుడు వినిపించింది. భర్త పలవరింతలకి మరింత బిక్కచచ్చి కుదిపి కుదిపి లేపింది.

రాజయ్య వులిక్కిపడి భార్య నమాంతం కౌగిలించుకుని ''ఏమిటే !'' అన్నాడు గొంతుక ఆర్చుకు పోతూంటే తడిచేసుకని

మరికొన్ని క్షణాలకి తెప్పరిల్లి "మునగచెట్టు నరికేశా నన్నట్లు కలగన్నా" నన్నాడు.

"అది సరేగాని, బయట ఏదో చప్పుడయ్యిందే కాస్త చూడవా ?" అన్నది పార్వతి భయంగా భర్త దగ్గిరిగా జరిగి.

ఐతే తెల తెలవారుతూవుండగా, గాలివాన తెరిపి నిచ్చేటంతవరకూ రాజయ్యగాని, పార్వతిగాని యివతలికి రాలేదు.

* * *

కనకమ్మకి వులిక్కిపాటున తెలివొచ్చింది. "అయ్యో దేవుడా !" అంటూ లేచి కొట్టు కిటికీ తెరిచి చూసింది.

ఆమెకి ఒక్క గావుకేకతో స్పృహ తప్పిపోయింది.

కొండలు లేచింది. మునగచెట్టు మొదలంటా కూలిపోయి పడివుంది. గేదె, పెయ్యా ఆ రెండూ మాత్రం దానికింద పడలేదు.

అందరూ లేచారు.

రాజయ్య యివతలికి వచ్చి చూశాడు. చెట్టు కూలిపడింది తన గోడమీద కేనైనా, ఆనందపారవశ్యంతో "ఓసేవ్ మునగచెట్టు కూలిందేవ్!" అని యింట్లోకి పరుగెత్తబోయి జర్రున జారిపడ్డాడు.

''ఓలమ్మోయ్ ! నా దేవుడో !'' అంటూ పార్వతి వచ్చి భర్తను లేవదీసింది.

అయితే కూలిన మునగచెట్టు కాయాన్ని. కనకమ్మ దుఃఖం, యింత పిసరు చిగురింపలేకపోయింది.

మునగచెట్టు ముగిసింది.